

కార్యకర్తే అధినేత.. కార్యకర్తే తెలుగుదేశం పార్టీకి బలం.. బలగం. పార్టీకి, కార్యకర్తకు మధ్య డిజిటల్ వారధిగా రూపొందించిన 'మైటీడీపీ' యాప్‌లో నమోదైన మన కుటుంబ సభ్యుల సంఖ్య 10 లక్షలకు చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. క్షేత్రస్థాయిలో కార్యకర్త పడే ప్రతి కష్టానికీ గుర్తింపు లభించాలి. ప్రతి కార్యకర్త అభిప్రాయానికీ విలువ ఉండాలి. పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత అవకాశాలు దక్కాలి. ఈ లక్ష్యంతోనే మైటీడీపీ యాప్‌కు శ్రీకారం చుట్టాం. ఈ ప్రయాణంలో భాగస్వాములైన 10 లక్షల మంది తెలుగుదేశం కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.

- నారా లోకేష్

అక్షరాలా.. పది లక్షలు!

'మైటీడీపీ' యాప్ సృష్టించిన సరికొత్త చరిత్ర

- కార్యకర్తే అధినేత అన్నది నినాదం కాదు, పార్టీ విధానం
- ప్రాంతీయ పార్టీల డిజిటల్ ప్రయాణంలో అరుదైన మైలురాయి
- క్షేత్రస్థాయిలో కార్యకర్త కష్టానికి గుర్తింపు.. కష్టానికి తగిన పదవులు
- కార్యకర్త నుంచి అధినేత వరకు నేరుగా అనుసంధానం
- శ్రేణుల మనోభావాలు తెలుసుకునేందుకు ప్రత్యేక వేదిక
- కార్యకర్తలకు గుర్తింపు, అవకాశాల కల్పనే లక్ష్యంగా లోకేష్ కృషి

3



కార్యకర్తే అధినేత... ఇది తెలుగుదేశం పార్టీకి కేవలం నినాదం మాత్రమే కాదు. ఆచరణలో చేసి చూపిస్తున్న సిద్ధాంతం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు పార్టీ సంస్థాగత బలోపేతంలోనూ సరికొత్త డిజిటల్ విప్లవానికి నాంది పలికింది. పార్టీకి, కార్యకర్తలకు మధ్య డిజిటల్ వారధిగా రూపొందించిన 'మైటీడీపీ' యాప్‌లో నమోదైన వారి సంఖ్య 10 లక్షలకు చేరుకుంది. దేశంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీల డిజిటల్ ప్రయాణంలో తెలుగుదేశం పార్టీ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది.

లోకేష్ కృషికి అభినందనలు: సీఎం

అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ రూపొందించిన మై-టీడీపీ యాప్‌ను 10 లక్షల మంది కార్యకర్తలు డౌన్‌లోడ్ చేసుకోవడంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ప్రయాణంలో అరుదైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ విజయానికి కృషి చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేష్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మై-టీడీపీ యాప్ కేవలం సభ్యత్వ నమోదుకే పరిమితం కాకుండా, పార్టీ నాయకత్వానికి, క్షేత్రస్థాయి కార్యకర్తలకు మధ్య ఒక బలమైన వారధిగా నిలుస్తోందన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపును ఇచ్చే శక్తివంతమైన వేదికగా ఈ యాప్ రూపొందిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ నుంచి ప్రతి కార్యక్రమం యాప్ ద్వారా పార్టీకి అందుబాటులో ఉంటుందన్నారు. కార్యకర్తలను గుర్తించడంలో సాంకేతికతను అధిష్ఠానం ఉపయోగించుకుంటుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.


నేడు తిరుమలకు సీఎం చంద్రబాబు

- సీఎం సమక్షంలో టీటీడీకి 121 కిలోల బంగారు ఆభరణాలు సమర్పణ
- శ్రీవారికి బంగారు ఆభరణాలు సమర్పించనున్న ఓ భక్తుడు

- వివరాలు 4 లో..

ప్రభుత్వ పాలసీలు, సంస్కరణలతో

మెరుగైన ఆదాయార్జన



2

- గాడిలో పడుతున్న వ్యవస్థలు...
- 2027 మార్చి నాటికి 100 శాతం ఫలితాలు సాధించేలా కృషి
- సావరిన్ ఏఐ స్టాక్ ద్వారా రెవెన్యూ రియలైజేషన్
- ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు



మరింతగా ధరణి బియ్యం

500 కేంద్రాలకు బియ్యం విక్రయాల విస్తరణ

- నిత్యావసరాల ధరల భారం ప్రజలపై పడకూడదు
- డిసెంబర్‌నుంచి రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, పామాయిల్ సరఫరా
- డిమాండ్ ఉన్న పంటల సాగుకు ప్రోత్సాహం
- నిత్యావసరాలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా కఠిన చర్యలు
- ధరల నియంత్రణపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రభుత్వ చర్యలతో బియ్యం, ఉల్లి, పామాయిల్ ధరలు తగ్గాయని తెలిపిన అధికారులు





4



కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన ఆయన, తక్షణమే పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

'పైప్‌లైన్' ఘటనపై వివరణ కోరిన సీఎం

2

చైతన్యరథం

ప్రభుత్వ పాలసీలు, సంస్కరణలతో

మెరుగైన ఆదాయార్జన

- గాడిలో పడుతున్న వ్యవస్థలు...
- 2027 మార్చి నాటికి 100శాతం ఫలితాలు సాధించేలా కృషి
- సావరిన్ ఏఐ స్టాక్ ద్వారా రెవెన్యూ రియలైజేషన్
- ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు
- నవంబర్ నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లు
- గత ఏడాది కంటే 18.8 శాతం మేర వృద్ధితో రూ.11,738 కోట్లు అదనపు ఆదాయం



అమరావతి (చైతన్య రథం): ప్రజలపై అదనపు పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండా ప్రభుత్వ శాఖల ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. ఆదాయార్జన శాఖలపై బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గడచిన రెండున్నరేళ్లుగా ప్రభుత్వ నిర్ణయాలు, సంస్కరణలు, అభివృద్ధికార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, వివిధ ప్రభుత్వ శాఖల్లోని వ్యవస్థలు గాడిలో పడ్డాయని సీఎం అన్నారు. ఆదాయ లీకేజీలను తగ్గించడం, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడంలో పలు శాఖలు మెరుగైన ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల కూటమి పాలనలో పారదర్శకత, ఆన్‌లైన్ సేవలు, శాఖాపరమైన సంస్కరణలతో ఆదాయం పెరుగుతోందన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ఆదాయంలోనూ ప్రతిఫలించాలని సీఎం చెప్పారు. ప్రతీవారం ఆదాయ ఆర్జనలపై దృష్టి సారిస్తూ... ఆ మేరకు నివేదికలు సిద్ధం చేసుకోవాలని...అవసరమైన మేరకు మార్పులు చేర్పులు చేసుకుంటూ మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ ప్రత్యేక ఏఐ స్టాక్ ద్వారా ఆదాయాలను మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశారు. సమన్వయంతో డేటా లేక్ ద్వారా సమాచారాన్ని విశ్లేషించి ఎక్కడా రెవెన్యూ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. 2027 మార్చి నాటికి వంద శాతం వ్యవస్థల్లో మెరుగుదలచూపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వాణిజ్యపన్నులు,ఎక్సైజ్, గనులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్, పురపాలక, పంచాయతీరాజ్, అటవీ శాఖల లాంటి ఆదాయార్జన శాఖలు సాంకేతికతను అమలు చేయాలని స్పష్టంచేశారు. నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయివరకూ ఎప్పటికప్పుడు వివిధ శాఖల్లో నమోదైన వృద్ధిని నమోదు చేయాలన్నారు. భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తదితర అంశాలపై అధ్యయనం చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించారు. మద్యం తయారీ నుంచి విక్రయం వరకూ ట్రాకింగ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాహనాల లోడ్, ఇ-వేబిల్స్ సహా వివిధ అంశాలపై రవాణాశాఖ ఎలక్ట్రానిక్ విధానంలో పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

వార్షిక లక్ష్యంలో ఇప్పటికే సమకూరిన 58 శాతం ఆదాయం

2026-27 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 23నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరిందని అధికారులు సమీక్షలో వివరించారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.62,604 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.11,738 కోట్లు పెరిగి 18.7 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. రూ.1,27,506 కోట్ల వార్షిక లక్ష్యంలో నవంబర్ 23 నాటికి 58 శాతం సాధించినట్లు వెల్లడించారు.

సమీక్షలో వివిధ శాఖల ఆదాయాలపై అధికారులు వివరిస్తూ పన్ను ఆదాయం గత ఏడాది ఇదే కాలంలో రూ.53,692 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.63,796 కోట్లకు చేరిందని... పన్నుల ద్వారా రూ.10,104 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని... పన్ను ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. వాణిజ్య పన్నుల ఆదాయం 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్లు పెరిగి రూ.38,241 కోట్లకు చేరిందని అధికారులు తెలిపారు. ఇందులో జీఎస్టీ ఆదాయం 18.1 శాతం వృద్ధితో రూ.3,694 కోట్లు పెరిగి రూ.24,073 కోట్లకు చేరిందని వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.20,083 కోట్లకు చేరిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.3,287 కోట్లు అదనంగా రావడంతో 19.6 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం 16.6 శాతం పెరిగి రూ.8,020 కోట్లకు, వాహన పన్నుల ఆదాయం 17.3 శాతం పెరిగి రూ.3,649 కోట్లకు చేరిందని అధికారులు స్పష్టం చేశారు. గనులు, భూగర్భ శాఖ ఆదాయం 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు, అటవీ శాఖ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.22 కోట్లకు చేరిందని అన్నారు. పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు పెరిగిందని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ

ఏప్రిల్ 1నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీలకు సుమారు రూ.239 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని, ఇదే కాలంలో పట్టణ స్థానిక సంస్థలకు సుమారు రూ.2,366 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని అధికారులు సమీక్షలో వివరించారు. ఆస్తిపన్ను వసూళ్లను మెరుగుపరిచేందుకు 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, న్యాయ వ్యవహారాల్లో ఏఐని వినియోగిస్తున్నట్లు వివరించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో గత ఏడాది రూ.1,015 కోట్ల పన్నుల్ని డిజిటల్‌గానే వసూలు చేసినట్లు అధికారులు తెలియజేశారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు..

పైప్‌లైన్ ధ్వంసంపై వివరణ కోరిన సీఎం

-కేసుల నమోదు, తీసుకున్న చర్యలపై సీఎంవోకు కలెక్టర్ నివేదిక



అమరావతి (చైతన్య రథం): కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం పెన్నా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన ఆయన, తక్షణమే పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎం కార్యాలయం జిల్లా అధికారుల నుంచి సమగ్ర నివేదిక కోరింది. ఇసుక అక్రమ తవ్వకాలతోపాటు ప్రజల అవసరాలకు ఉద్దేశించిన తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేయడాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని సీఎంఓ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా, అక్రమ మైనింగ్‌కు పాల్పడినా ఎవరినీ ఉపేక్షించవద్దని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలపై స్పందించిన కడప జిల్లా కలెక్టర్, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను సీఎంవోకు నివేదించారు. ప్రొద్దుటూరు మండలంలోని



సోములవారిపల్లి వద్ద ఇసుక తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించారని కలెక్టర్ తెలిపారు. తక్షణమే రంగంలోకి దిగిన అధికారులు అక్రమ తవ్వకాలను, ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేశారని వివరించారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్లు, వాటి యజమానులు, ఈ ఘటనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వ్యక్తుల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారని... ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన నిందితులు, ట్రాక్టర్ యజమానులపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేశామని, దెబ్బతిన్న పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించామని కలెక్టర్ పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ నివేదికలో పేర్కొన్నారు. పెన్నా, చిత్రావతి నదీ తీర ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌ను కట్టడి చేసేలా జిల్లా, మండల స్థాయి కమిటీలను నియమించామని చెప్పారు. పెన్నా, చిత్రావతి నదుల పరివాహక ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు సమన్వయంతో పనిచేస్తూ చెక్‌పోస్టుల ద్వారా అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. పెన్నా నది వెంబడి నిరంతర నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఇటువంటి అక్రమాలు, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్న సీఎం ఆదేశాలను సీఎంఓ, జిల్లా కలెక్టర్‌కు తెలియజేసింది.

అక్షరాలా.. పది లక్షలు!

- ‘మైటీడీపీ’ యాప్ సృష్టించిన సరికొత్త చరిత్ర
- కార్యకర్తే అధినేత.. నినాదం కాదు, పార్టీ విధానం
- ప్రాంతీయ పార్టీల డిజిటల్ ప్రయాణంలో అరుదైన మైలురాయి
- క్షేత్రస్థాయిలో కార్యకర్త కష్టానికి గుర్తింపు.. కష్టానికి తగిన పదవులు
- కార్యకర్త నుంచి అధినేత వరకు నేరుగా అనుసంధానం
- శ్రేణుల మనోభావాలు తెలుసుకునేందుకు ప్రత్యేక వేదిక
- కార్యకర్తలకు గుర్తింపు, అవకాశాల కల్పనే లక్ష్యంగా లోకేష్ కృషి



అమరావతి (చైతన్య రథం): కార్యకర్తే అధినేత... ఇది తెలుగుదేశం పార్టీకి కేవలం నినాదం మాత్రమే కాదు. ఆచరణలో చేసి చూపిస్తున్న సిద్ధాంతం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు పార్టీ సంస్థాగత బలోపేతంలోనూ సరికొత్త డిజిటల్ విప్లవానికి నాంది పలికింది. పార్టీకి, కార్యకర్తలకు మధ్య డిజిటల్ వారధిగా రూపొందించిన ‘మైటీడీపీ’ యాప్‌లో నమోదైన వారి సంఖ్య 10 లక్షలకు చేరుకుంది. దేశంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీల డిజిటల్ ప్రయాణంలో తెలుగుదేశం పార్టీ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది.

కార్యకర్త కష్టానికి గుర్తింపు.. సామాన్య కార్యకర్తలకు పదవులు

ఒకప్పుడు మారుమూల గ్రామంలో పార్టీ జెండా మోసే కార్యకర్త పడిన కష్టం పార్టీ అధిష్ఠానానికి తెలియడం అంత సులభం అయ్యేది కాదు. ఆ పరిస్థితిని ‘మైటీడీపీ’ యాప్ మార్చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు కల్పించేందుకు ఈ యాప్‌ను రూపొందించారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలు, ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసే కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారం, సేవా కార్యక్రమాల వివరాలను కార్యకర్తలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో ఏ కార్యకర్త ఎంత చురుగ్గా పనిచేస్తున్నారనే విషయం నేరుగా పార్టీ నాయకత్వానికి తెలుస్తోంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతోమంది సాధారణ కార్యకర్తలకు కార్పొరేటర్లు, సర్పంచులుగా అవకాశాలు లభించాయి. పార్టీ, నామినేటెడ్ పదవుల్లోనూ కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యం దక్కుతోంది. అటువంటి కార్యకర్తలను గుర్తించడంలో ‘మైటీడీపీ’ యాప్ ద్వారా అందుతున్న పనితీరు వివరాలు కీలకంగా మారాయి.

కార్యకర్త నుంచి అధినేత వరకు నేరుగా అనుసంధానం

పార్టీ అధినేత సందేశాలు, నాయకత్వం ఇచ్చే సూచనలు, పార్టీ కార్యక్రమాల వివరాలు క్షణాల్లో కార్యకర్తలకు చేరుతున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, సమస్యలు నేరుగా పార్టీ నాయకత్వానికి చేరుతున్నాయి. పార్టీ కార్యక్రమాలపై కార్యకర్తల స్పందనను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వారి సూచనలకు ప్రాధాన్యం ఇచ్చేలా యాప్‌ను రూపొందించారు. కార్యకర్తలకు సమాచారం అందించడమే కాకుండా, కార్యకర్తల నుంచి సమాచారాన్ని సేకరించే సమగ్ర డిజిటల్ వ్యవస్థగా ‘మైటీడీపీ’ పనిచేస్తోంది.

డిజిటల్ మహానాడుతో సరికొత్త ఒరవడి

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడులోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి డిజిటల్ మహానాడుకు శ్రీకారం చుట్టారు. కార్యకర్తల నమోదు, హాజరు, కార్యక్రమాల నిర్వహణలో డిజిటల్ వ్యవస్థను వినియోగించడం ద్వారా కొత్త ఒరవడికి నాంది పలికారు. కార్యకర్తల సమావేశాలు, శిక్షణా తరగతులు, ఇతర పార్టీ కార్యక్రమాల నిర్వహణలోనూ ‘మైటీడీపీ’ కీలక పాత్ర పోషిస్తోంది.

కార్యకర్త చేతిలోనే పార్టీ డిజిటల్ వ్యవస్థ

- ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాలతో పాటు పార్టీ పిలుపునిచ్చే వివిధ కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ.
- క్షేత్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు.
- కార్యకర్తలు తాము నిర్వహించిన కార్యక్రమాల వివరాలు, ఫొటోలను యాప్‌లో ప్రచురించుకునే అవకాశం.
- పార్టీ నాయకుల కార్యక్రమాలు, ఫొటోలు, పార్టీకి సంబంధించిన తాజా సమాచారం అందుబాటులో ఉంచడం.
- సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలు, సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.
- కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలను ఎప్పటికప్పుడు సేకరించడం.
- కార్యకర్తల సమావేశాలు, శిక్షణా తరగతులు, పార్టీ కార్యక్రమాల హాజరు నమోదు.
- కార్యకర్తల ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం.

ఫొటో బూత్ ప్రత్యేక ఆకర్షణ

పార్టీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. సమావేశాలకు హాజరైన కార్యకర్తలతో ఫొటోలు దిగుతున్నారు. ఆ ఫొటోలను ‘మైటీడీపీ’ యాప్ ద్వారా నేరుగా కార్యకర్తలకు అందించేలా ప్రత్యేక సదుపాయం కల్పించారు. కార్యకర్తలు ఒక్కసారి యాప్‌లో తమ ముఖాన్ని స్కాన్ చేసుకుంటే చాలు... ఆ తర్వాత పార్టీ అధినేతతో, నారా లోకేష్‌తో ఎప్పుడు ఫొటో దిగినా, సంబంధిత ఫొటోలు యాప్‌లోని ‘ఫొటో బూత్’ విభాగంలోకి నేరుగా వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ సదుపాయం కార్యకర్తలను విశేషంగా ఆకట్టుకుంటోంది.

చురుగ్గా పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు

‘మైటీడీపీ’ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. నారా లోకేష్ నియోజకవర్గాల పర్యటనల సందర్భంగా యాప్ ద్వారా అప్పగించిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిన కార్యకర్తలను గుర్తించి, వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందనే భరోసాను కల్పిస్తున్నారు.

‘మైటీడీపీ’ వినియోగంలో ముందంజలో ఉన్న నియోజకవర్గాలు

రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల నుంచి ‘మైటీడీపీ’ యాప్‌కు విశేష స్పందన లభిస్తోంది. యాప్ వినియోగం, పార్టీ కార్యక్రమాల నమోదులో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన నియోజకవర్గాలు ఇవే.

పార్లమెంట్ నియోజకవర్గాలు: నరసరావుపేట, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు.

అసెంబ్లీ నియోజకవర్గాలు: కుప్పం, విసుకొండ, కనిగిరి, మంగళగిరి, గన్నవరం.

రాజకీయాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి కొత్త నిర్వచనం. దేశంలో అనేక రాజకీయ పార్టీలకు డిజిటల్ వేదికలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కార్యకర్త పడే కష్టాన్ని గుర్తించడం, వారి పనితీరును తెలుసుకోవడం, అభిప్రాయాలను నేరుగా సేకరించడం, ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించడం వంటి ప్రత్యేకతలతో ‘మైటీడీపీ’ యాప్‌ను తీర్చిదిద్దారు. కేవలం పార్టీ సమాచారాన్ని కార్యకర్తలకు చేరవేసే వేదికగా కాకుండా, కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధికి ఉపయోగపడే సమగ్ర డిజిటల్ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారు.

10 లక్షల మంది... ఒకే పసుపు కుటుంబం

‘మైటీడీపీ’ యాప్‌లో 10 లక్షల మంది నమోదు చేసుకోవడం కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. పార్టీపట్ల కార్యకర్తలకు ఉన్న అంకితభావానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వారి చైతన్యానికి నిదర్శనం. ఒకప్పుడు కార్యకర్తపడిన కష్టం పార్టీకి తెలియడం కష్టంగా ఉండేది. ఇప్పుడు కార్యకర్త వేసే ప్రతి అడుగూ పార్టీకి తెలుస్తోంది. కార్యకర్త కష్టానికి గుర్తింపు, ప్రతిభకు ప్రోత్సాహం, అంకితభావానికి తగిన అవకాశాలు కల్పిస్తూ ‘కార్యకర్తే అధినేత’ అనే నినాదాన్ని ఆచరణలోచూపిస్తోంది తెలుగుదేశం పార్టీ. కార్యకర్తే పార్టీకి బలం...కార్యకర్తకు బలం ‘మైటీడీపీ’.

చైతన్యరథం

నిత్యావసరాల ధరల భారం

ప్రజలపై పడకూడదు

- 500 కేంద్రాలకు ధరణి బియ్యం విక్రయాల విస్తరణ
- డిసెంబర్‌నుంచి రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, పామాయిల్ సరఫరా
- డిమాండ్ ఉన్న పంటల సాగుకు ప్రోత్సాహం
- నిత్యావసరాలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా కఠిన చర్యలు
- ధరల నియంత్రణపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రభుత్వ చర్యలతో బియ్యం, ఉల్లి, పామాయిల్ ధరలు తగ్గాయని తెలిపిన అధికారులు



అమరావతి (చైతన్య రథం): నిత్యావసర వస్తువుల ధరల భారం సామాన్య ప్రజలపై ఏమాత్రం పడకూడదని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రజలకు ఊరట కలగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వినియోగదారుడిని ఆదుకోవడమే ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం నిత్యావసరాల ధరల నియంత్రణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. రానున్న ఏడాదిన్నర పాటు నిరంతరం మార్కెట్ ధరలను, ద్రవ్యోల్బణాన్ని బేరీజు వేస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన ధరల నియంత్రణ చర్యలతో మార్కెట్‌లో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. గత నెలతో పోలిస్తే రాష్ట్రంలో నాలుగు వెరైటీల బియ్యం ధరలు 8 నుంచి 18 శాతం వరకు తగ్గాయని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో జై శ్రీరామ్ బియ్యం కిలో రూ.79-82, హెచ్ఎంటీ/ఆర్ఎన్ఆర్ రూ.72-76, బీపీటీ రూ.64-66, సాధారణ బియ్యం రూ.46-48కు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. బియ్యం విక్రయాల విషయంలో ప్రభుత్వం ధరల పట్టికను ప్రకటించడంతోపాటు... బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా బియ్యం నిల్వలపై నిరంతర నిఘా పెట్టామని అధికారులు తెలిపారు. అలాగే ఉల్లి ధర 28 శాతంమేర తగ్గిందని చెప్పారు. పామాయిల్ ధరలు కూడా 5 శాతం తగ్గి లీటరు రూ.145కు చేరిందని అధికారులు వెల్లడించారు. అయితే కందిపప్పు ధరల్లో ఇంకా పెరుగుదల కనిపిస్తోందని చెప్పారు.

రేషన్ ద్వారా కందిపప్పు... పామాయిల్‌ను ఎప్పటి నుంచి సరఫరా చేస్తారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. రేషన్ దుకాణాల ద్వారా అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలపడంతో... జాప్యం కావడానికి వీల్లేదని... డిసెంబర్ మొదటివారం నుంచి రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ.100కే వినియోగదారులకు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే టెండర్ల ద్వారా సేకరించిన ఫోర్టిఫైడ్ పామాయిల్‌ను డిసెంబర్ మొదటివారం నుంచి రేషన్ దుకాణాల్లో లీటరు రూ.125కే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఇక కందిపప్పు ధరను ఇంకా అదుపులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయించిన 40,300 మెట్రిక్ టన్నుల కందులను సరఫరా చేయడంతోపాటు... రాష్ట్రంలో కందిపప్పు ఉత్పత్తి, వినియోగం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేలా కంది సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. కంది సాగు చేసే రైతులకు కనీస మద్దతు ధరను అమలు చేయాలన్నారు.

ధరణి బియ్యానికి పెరిగిన ఆదరణ

ధరణి బ్రాండ్ పేరుతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న 26 కిలోల బస్తా సూపర్ ఫైన్ బియ్యానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అధికారులు వివరించారు. మార్కెట్లో కిలో రూ.76 ఉన్న కెఎన్ఎం/ఆర్ఎన్ఆర్ బియ్యాన్ని రూ.50కే, రూ.66 ఉన్న బీపీటీ ముడి బియ్యాన్ని రూ.49కే అందిస్తుండగా, ఇప్పటివరకు 2.25 లక్షల మందికి పైగా వినియోగదారులు 59,662 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. ప్రస్తుతం 286 కేంద్రాల్లో ఈ విక్రయాలను జరుపుతున్నామని అధికారులు చెప్పారు. అయితే ఈ విక్రయ కేంద్రాలను 500 కేంద్రాలకు విస్తరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

బియ్యం సహా వివిధ నిత్యావసరాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులను అడిగారు. అధిక ధరల విక్రయాలపై విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ బృందాలు 1,558 తనిఖీలు నిర్వహించి 1,005 కేసులు నమోదు చేయడంతో పాటు రూ.84.59 లక్షల జరిమానా వసూలైందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. టోల్‌గేట్లు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని ఆదేశించారు.

నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక

ఎల్ నినో ప్రభావంతో వివిధ పంటల దిగుబడులపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయాలని సీఎం సూచించారు. ఉల్లి, టమాట ధరలు రానున్న రోజుల్లో మరింత తగ్గుతాయని అగ్రివాచ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. కూరగాయల ధరలు కూడా ఎంతమాత్రం పెరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కృష్ణా డెల్టా వంటి ప్రాంతాల్లో కూడా తక్కువ నీటితో పండే సన్నరకం వరి సాగును ప్రోత్సహించాలన్నారు. ఫైన్ వెరైటీ రకాలకు అదనపు మద్దతు ధర కల్పించే అంశం ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేయాలని... అవసరమైన పక్షంలో కేంద్రంతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి సూచించారు.

మంచి లాభాలు వస్తుండడంతో పల్నాడు వంటి ప్రాంతాల్లోనూ ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించగా... భూగర్భ జలాలు లేని ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ వేస్తే భవిష్యత్తులో రైతులు నష్టపోతారని సీఎం స్పష్టం చేశారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్నచోటే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని... నీటి లభ్యత తక్కువగా ఉండే చోట ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా చూడాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అగ్రివాచ్ డేటా, వర్షపాతం ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు తిరుమలకు

సీఎం చంద్రబాబు

- సీఎం సమక్షంలో టీటీడీకి 121 కిలోల బంగారు ఆభరణాలు సమర్పణ
- శ్రీవారికి బంగారు ఆభరణాలు సమర్పించనున్న ఓ భక్తుడు

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేటి ఉదయం 8.30 గంటలకు అమరావతి నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లనున్నారు. తిరుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఓ భక్తుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి 121 కిలోల బంగారు ఆభరణాలను సమర్పించనున్నారు. దాతల నుంచి బంగారు ఆభరణాలను టీటీడీ అధికారికంగా స్వీకరించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. గురువారం ఉదయం అమరావతి నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. అక్కడి నుంచి ఘాట్ రోడ్డు మార్గంలో ప్రయాణించి ఉదయం 10.45 గంటలకు తిరుమలలోని గాయత్రీ నిలయానికి చేరుకుంటారు. 11.10 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. దర్శనం అనంతరం ఉదయం 11.35 గంటలకు స్వామివారికి 121 కిలోల బంగారు ఆభరణాల సమర్పణ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. అనంతరం దాతల నుంచి శ్రీవారి కిరీటం, పద్మ పాదాల ఆభరణాలను టీటీడీ అధికారికంగా స్వీకరించే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరుపతి నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం వెళ్లనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి ముఖ్యమంత్రి అమరావతికి చేరుకుంటారు.

కాకినాడ హార్బర్‌కు సురక్షితంగా బోటు

- క్షేమంగా ఏడుగురు ఏటిమొగ మత్స్యకారులు
- అధికారులు పనితీరు అభినందనీయం
- ఉప్పాడ మత్స్యకారుల ఆచూకీ కోసం కొనసాగుతున్న ముమ్మర గాలింపు చర్యలు
- కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక లేఖ రాశాం
- బంగ్లాదేశ్, మయన్మార్ సహకారానికి చర్యలు
- మత్స్యకారుల ప్రాణరక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): కాకినాడ జిల్లా ఏటిమొగ నుంచి చేపల వేటకు వెళ్లి ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటు సురక్షితంగా కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకోవడం సంతోషకరమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. డ్రైవర్‌తో సహా ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావడం వారి కుటుంబసభ్యులకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. ఏటిమొగకు చెందిన సెరు రామలక్ష్మి పేరుతో నమోదైన యాంత్రిక మత్స్యకార బోటు ఈ నెల 23వ తేదీ రాత్రి ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉప్పాడ-తుని తీరంలోని కృష్ణాపురం సమీపంలో నిలిచిపోయిందని వివరించారు. తీరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోటు నుంచి డ్రైవర్ దమ్ము అప్పారావు సమాచారం అందించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమైనట్లు తెలిపారు. అత్యవసర ఫోన్‌కాల్ అందిన వెంటనే స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయంలోనూ వాకలపూడి ఇన్‌స్పెక్టర్ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కోస్ట్‌గార్డ్, నౌకాదళ అధికారులకు సమాచారం చేరవేయడంతోపాటు మత్స్యశాఖతో సమన్వయం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. సముద్రపు నీటి లోతు తక్కువగా ఉండటంతో భారీ నౌకల రాకకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ బోట్ల యజమానుల సంఘం సహకారంతో సహాయక ప్రయత్నాలు చేపట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో వేగంగా స్పందించిన కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉప్పాడ మత్స్యకారుల గల్లంతుపై ప్రత్యేక దృష్టి

మరోవైపు కాకినాడ జిల్లా ఉప్పాడలోని సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ నెల 4న రెండు బోట్లలో పారాదీప్ వైపు చేపల వేటకు వెళ్లగా, ఒక బోటు 18న తిరిగి వచ్చిందని వివరించారు. మరో బోటులోని మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో 19న ఫిర్యాదు అందగా అప్పటి నుంచి సంబంధిత శాఖల సమన్వయంతో గాలింపు కొనసాగుతోందని తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశామని తెలిపారు. వారి ఆచూకీ గుర్తించేందుకు అవసరమైన సహకారం కోరడంతోపాటు బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సముద్ర జలాల వైపు వెళ్లి ఉండే అవకాశాలను కూడా పరిశీలిస్తామన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ ద్వారా ఆయా దేశాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత తీర రక్షక దళం, నౌకాదళం, ఒడిశా అధికారులు, రాష్ట్ర మత్స్యశాఖ సమన్వయంతో గాలింపును మరింత వేగవంతం చేయాలని సూచించారు. మత్స్యకారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. చేపల వేటకు వెళ్లే ముందు బోట్ల ఇంజిన్లు, ట్రాన్స్‌పాండర్లు, సమాచార వ్యవస్థలు, ఇతర రక్షణ పరికరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. మత్స్యకారుల ప్రాణరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు.





టీడీపీ నేత బంగార్రాజు కుమారుడి
వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

భోగాపురం (చైతన్య రథం): విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కర్రోతు బంగార్రాజు కుమారుడి వివాహ వేడుక భోగాపురం మండలం పోలిపల్లిలోని భూమాత గ్రీన్‌వే రిసార్ట్‌లో ఘనంగా జరిగింది. కళ్యాణ మహోత్సవానికి విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. నూతన వధూవరులు శేఖర్, నేహాలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతోసాగాలని ఈసందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు భోగాపురం విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.













చైతన్యరథం



దేశంలోనే ఆదర్శంగా ఏపీ పింఛన్ల పంపిణీ

- పేదల జీవితాల్లో ఎన్టీఆర్ భరోసా వెలుగులు



పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సామాజిక భద్రతకు సరికొత్త నిర్వచనం చెబుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం దేశానికే ఆద ర్శంగా నిలుస్తోంది. పింఛన్ అంటే కేవలం నెలవారీ ఆర్థిక సాయం మాత్రమే కాదు...వృద్ధాప్యంలో ఉన్నవారికి ఆసరా, దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం, వితంతువులకు జీవన భద్రత, పేద కుటుంబాలకు కొండంత అండ అనే విషయాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఆచరణలో చూపిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తూ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం ద్వారా లక్షలాది పేద కుటుంబాల్లో ఆనందం నింపింది. ఇప్పటివరకు అక్టోబరు నెలతో కలిపి సుమారు రూ.80 వేల కోట్లను పింఛన్ల పంపిణీకి ఖర్చు చేయడం కూటమి ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగునాట సంక్షేమ పాలనకు బలమైన పునాది వేశారు. పేదలు, వృద్ధులు, బలహీన వర్గాల జీవితాల్లో ప్రభుత్వా నికి కూడా ఒక బాధ్యత ఉంటుందనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆ సంక్షేమ వారసత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ, పేదలకు నిజమైన భరోసా కల్పించే వ్యవస్థను నిర్మించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ఎన్టీఆర్ భరోసా పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

అధికారంలోకి రాగానే హామీ అమలు

గత ప్రభుత్వ హయాంలో పింఛన్ మొత్తాన్ని కేవలం రూ. 1,000 పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుంటే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ.4,000 కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తొలి నెల నుంచే పెరిగిన పింఛన్‌ను అందించడం ద్వారా చంద్రబాబు ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. వృద్ధులకు నెలకు రూ.4,000, పాక్షిక దివ్యాంగులకు రూ.6,000, పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ.15,000, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.10,000 చొప్పున అందిస్తూ ప్రత్యేక అవసరాలున్న వారికి మరింత ఆర్థిక చేయూతనిస్తోంది. ఈ స్థాయిలో పింఛన్ మొత్తాలను అందించడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది.

21 రకాల సామాజిక భద్రతా పింఛన్లు

ఎన్టీఆర్ భరోసా పథకం పరిధిని విస్తృతం చేస్తూ సమాజం లోని వివిధ వర్గాలకు ప్రభుత్వం ఆర్థిక అండ అందిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, ట్రాన్స్‌జెండర్లు, తలసీమియా బాధితులు తదితరుల కు కలిపి 21 రకాల సామాజిక భద్రతా పింఛన్లను అందిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 లక్షల మందికి ప్రతి నెలా పింఛన్లు అందిస్తూ వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తోంది. కొత్తగా అర్హత పొందినవారిని గుర్తించి పింఛన్లు మంజూరు చేయడంతో పాటు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదా పు 2.30 లక్షల మంది స్పౌజ్ పింఛన్లను మంజూరు చేయడం ద్వారా అర్హులకు న్యాయం చేసే ప్రయత్నం చేసింది.

ఇంటివద్దకే పింఛన్.. పేదల ఆత్మగౌరవానికి పెద్దపీట

పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి గుమ్మం వద్దకే వెళ్లి పింఛన్లు అందించే విధానాన్ని ప్రభు త్వం కొనసాగిస్తోంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది ద్వారా పంపిణీ ప్రక్రియను నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలం లో పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటోంది. వయోభారంతో నడవలేని వృద్ధులు, శారీరక వైకల్యంతో బయటకు వెళ్లలేని దివ్యాంగులకు ఇంటివద్దే పింఛన్ అందించడం వల్ల వారి ఆత్మగౌరవం కాపాడబడుతోంది. ఇతరులపై ఆధారపడకుండా తమ అవసరాలను తామే తీర్చుకునే వెసులుబాటు కలుగుతోంది. ఒక కుటుంబంలో పింఛన్ అందుకునే వ్యక్తికి మాత్రమే కాకుం డా ఆ కుటుంబంలోని ఇతర సభ్యులకు కూడా ఈ ఆర్థిక సాయం అండగా నిలుస్తోంది.

సాంకేతికతతో సమస్యలకు పరిష్కారం

పింఛన్ల పంపిణీలో ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్క రించేందుకు ప్రభుత్వం సాంకేతికతను కూడా వినియోగిస్తోంది. వాట్సాప్ ఆధారిత మనమిత్ర కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిం చింది.



జమ్ము సాయికల్యాణ్, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

పింఛన్ మంజూరు, పంపిణీ, ఇతర సమస్యలపై ఫిర్యాదు లను సులభంగా తెలియజేసేలా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం పాలనలో పారదర్శకతకు దోహదపడుతోంది. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అధికారు లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

సంక్షేమానికి భారీగా నిధుల కేటాయింపు

పింఛన్ల పంపిణీ కోసం ప్రతి నెలా రూ.2,700 కోట్లకు పైగా ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు ఎంతటి ప్రాధా న్యత ఇస్తోందో చాటుతోంది. ఇప్పటివరకు సుమారు రూ.80వేల కోట్ల వ్యయంతో లక్షలాది కుటుంబాలకు ఆర్థిక అండ అందించిం ది. కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పింఛన్ల పంపిణీ కోసం దాదాపు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పింఛన్ల కోసం రూ.84 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి మరింత భారీ స్థాయిలో నిధులు కేటాయించాలనే సంకల్పంతో పనిచేస్తోంది. ఈ వ్యయాల మధ్య ఉన్న వ్యత్యాసం పింఛన్ల విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల తీవ్రతను తెలియజేస్తోంది.

సంక్షేమంతో పాటు అభివృద్ధికీ ప్రాధాన్యత :

చంద్రబాబు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో సంక్షేమ కార్యక్రమాల కోసం సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం వెల్లడిస్తోంది. ఐదేళ్లలో దాదాపు రూ.4 లక్షల కోట్లను సంక్షేమ పథకాల కోసం వెచ్చించాలనే లక్ష్యంతో ఉంది. మరోవైపు రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేయడంతో పాటు, గత ప్రభుత్వం వదిలివెళ్లిన సుమారు రూ.40 వేల కోట్ల బకాయిలను చెల్లించింది. అభివృద్ధి, సంక్షేమం రెండిం టినీ సమన్వయం చేస్తూ రాష్ట్ర ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రభు త్వం కృషి చేస్తోంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా ప్రతి నెలా అందుతున్న ఆర్థిక సాయం లక్షలాది పేద కుటుంబాలకు కేవలం నగదు పంపిణీగా కాకుండా జీవన భద్రతగా మారుతోం ది. పేదవాడి కష్టాన్ని అర్థం చేసుకుని, అతని ఇంటి గుమ్మం వద్దకే వెళ్లి అండగా నిలవడమే నిజమైన ప్రజా పాలన అనే సందేశాన్ని కూటమి ప్రభుత్వం బలంగా చాటుతోంది. ఎన్టీఆర్ ప్రారంభించిన సంక్షేమ ప్రస్థానాన్ని చంద్రబాబు మరింత విస్తరిస్తూ... ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. సంక్షేమం కొందరికే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో సాగుతున్న ఈ ప్రయాణం స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో కీలక భాగంగా నిలుస్తోంది.

ఆత్మకూరు నియోజకవర్గంలో కూటమి విజయభేరి

- 135 గ్రామ పంచాయతీలకు 52 స్థానాలు ఏకగ్రీవం
- ఎన్నికైన నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందనలు



నెల్లూరు(చైతన్యరథం): ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ, ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులు గ్రామ పంచా యతీ ఎన్నికల్లో గణనీయమైన విజయాలు సాధిస్తున్నారు. నియో జకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో మొత్తం 135 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటికే 52 పంచాయతీల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం నెల్లూరు సంతపేటలోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివా సం, క్యాంపు కార్యాలయం వద్ద నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులతో సందడి నెలకొంది. నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన నూతన ప్రజా ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడు తూ ప్రజలు కూటమిపై ఉంచిన విశ్వాసానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి అభినం దనలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీపీ, ఉప ఎంపీపీ పదవులను తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి భారీ ఆధిక్యంతో కైవసం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయ తీ ఎన్నికల్లోనూ స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు సమన్వ యంతో పనిచేయడం వల్ల ఆశించిన ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన గ్రామ పంచాయతీల్లోనూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆకాంక్షించారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆత్మకూరు నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల ఆకాం క్షలకు అనుగుణంగా పారదర్శకమైన పాలన అందించడమే మనందరి లక్ష్యమని స్పష్టం చేశారు.

మండలాల వారీగా ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలు

ఆత్మకూరు	– 21 పంచాయతీలకు	9 ఏకగ్రీవం
చేజర్ల	– 26 పంచాయతీలకు	16 ఏకగ్రీవం
ఏఎస్ పేట	– 19 పంచాయతీలకు	7 ఏకగ్రీవం
సంగం	– 20 పంచాయతీలకు	6 ఏకగ్రీవం
అనంతసాగరం	– 25 పంచాయతీలకు	6 ఏకగ్రీవం
మర్రిపాడు	– 24 పంచాయతీలకు	8 ఏకగ్రీవం

మచిలీపట్నంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం

- రిజర్వాయర్లలో నిల్వ తర్వాతే పంపింగ్
- డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తాం
- ఎస్‌టీపీ పనుల్లో వేగం పెంచేలా చర్యలు
- అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం



మచిలీపట్నం(చైతన్యరథం): బందరు నగర వాసులను దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని, పనుల్లో జాప్యానికితావివ్వకూడదని స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని క్యాంపు కార్యా లయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికా రులు, మెగా కాంట్రాక్టర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నగరంలో తాగు నీటి పంపిణీ వ్యవస్థలోని లోటుపాట్లను గుర్తించి తక్షణమే సరిచేయాలని సూచిం చారు. రీ–జోనింగ్ విధానంతో నీటి సర ఫరాపై ఒత్తిడిని తగ్గించవచ్చని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుం డా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా నీరు అందాలన్నది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. డైరెక్ట్ పంపింగ్ వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందుగా రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి నిర్ణీత ప్రణాళిక ప్రకారం సరఫరా చేయాలని సూచించారు. నగరంలోని ఆరు రిజర్వాయర్లకు ఒకే ప్రధాన లైన్ ద్వారా నీటిని అందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిం చి చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్లలో లీకేజీలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, దెబ్బతిన్న పాత లైన్ల స్థానంలో అవసరమైన చోట కొత్త పైపులైన్లు వేయాలని ఆదేశించారు. ప్రస్తుత లైన్లకు మరమ్మతులు అవసరమైతే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. నీటి నిల్వలు అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న ప్రాంతాలకు నీరు చేరేలా సమర్థవంతమైన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ఐజీ రాజకుమారి వెల్లడి



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ, మలి దశ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న వేళ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని ఐజీ(రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్) బి.రాజకుమారి తెలి పారు. బుధవారం విజయవాడలో ఐజీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు 607 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని.. 213 మంది అరెస్ట్ చేశామని.. 1,785 మందికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126/129 కింద 25,207 బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు 1,41,687 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 37,942 ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులు నమోదు చేశామని వివరించారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా 9,337 ఆయుధాలు డిపాజిట్ చేశామని తెలిపారు. అలాగే 3,548.4 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియో గించు కోవాలని ప్రజలకు స్పష్టం చేశారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లం ఘించిన, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల చిటికెన వేలుపై సిరా గుర్తు



అమరావతి(చైతన్యరథం): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగిం చుకునే ఓటర్లకు ఎడమ చేతి చిటికెన వేలుపై చెరగని సిరా గుర్తు వేయాలని పోలింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటరు ఎడమ చేతి చూపుడు వేలుపై సిరా గుర్తు వేయడం ఆనవాయితీ. అయితే ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నిక ల సందర్భంగా ఓటర్ల ఎడమ చేతి చూపుడు వేలుపై సిరా గుర్తు వేశారు. అంతేకాకుండా కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రీ–పోలింగ్ నిర్వహించడంతో అక్కడి ఓటర్ల ఎడమ చేతి మధ్య వేలుపై కూడా సిరా గుర్తు వేశారు. తక్కువ వ్యవధిలోనే వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతుండటంతో అప్పటి సిరా గుర్తు లు ఇంకా చెరిగిపోలేదు. పంచాయతీ ఎన్నికల సమయంలో పాత సిరా గుర్తులతో ఓటర్లను గుర్తించడంలో పోలింగ్ సిబ్బంది ఇబ్బం ది పడకుండా, దొంగ ఓట్లను అడ్డుకట్ట వేసేందుకు ఎస్ఈసీ ఈ ప్రత్యేక ఉత్తర్వులను అమల్లోకి తీసుకువచ్చారు. ఇందుకనుగుణం గా పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి తగిన సూచనలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఎస్ఈసీ ఆదేశించారు.

ప్రజా విజయాన్ని చీకటి గెలుపు అంటారా?

- రోత పత్రికలో రోత రాతలు సాక్షిది నాలుకా.. తాటిమట్టా?
- ప్రజాతీర్పును అవమానించడమే జగన్‌రెడ్డి, నీలి పత్రిక లక్ష్యం
- వారికి వాస్తవాలతో పనిలేదు.. చంద్రబాబును కించపరచడమే అజెండా
- ఏడు దఫాలుగా అప్రతిహత విజయాలు.. ప్రతి ఎన్నికలోనూ 50 వేలకు పైగా మెజారిటీ
- ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన కుప్పం.. నేడు అభివృద్ధిలో ఇతర నియోజకవర్గాలతో పోటీ
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య



మంగళగిరి(చైతన్యరథం): చంద్రబాబుది 'చీకటి గెలుపు' అంటూ సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం మీడి యా సమావేశం నిర్వహించారు. ప్రజల మద్దతుతో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాధిస్తు న్న విజయాలను సాక్షి పత్రిక 'చీకటి గెలుపు' అంటూ అభివర్ణిం చడం దుర్మార్గమని మండిపడ్డారు. అసలు సాక్షిది నాలుకా.. తాటిమట్టా? ఒళ్లు తెలియకుండా మాట్లాడుతున్నారా? ఏడు దఫాలుగా అప్రతిహతంగా ప్రతి ఎన్నికలోనూ 50 వేలకు పైగా మెజారిటీతో చంద్రబాబు విజయం సాధిస్తున్నారు. కుప్పం ప్రజలు ప్రతి ఎన్నికలోనూ ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన కుప్పం నియోజకవర్గం నేడు చంద్రబా బు నాయకత్వంలో రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలతో అభివృ ద్ధిలో పోటీపడుతోంది. అలాంటి ప్రజాదరణ కలిగిన నాయకుడి విజయాన్ని చీకటి గెలుపు అనడం జగన్‌కు తగునా? అని ప్రశ్నించారు.

11 సీట్లకే పరిమితం చేసిన విషయాన్ని మర్చిపోయారా?

151 అసెంబ్లీ స్థానాలు ఇచ్చి ముఖ్యమంత్రిని చేసిన ప్రజలే.. 'నువ్వు మాకొద్దు బాబూ' అంటూ జగన్‌ను 11 సీట్లకే పరిమితం చేసిన విషయాన్ని మర్చిపోయారా అని కౌంటర్ ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సింది పోయి ఇప్పుడు అదే ప్రజా స్వామ్యాన్ని అవమానించేలా జగన్ వ్యవహరిస్తున్నారని మండిప డ్డారు. సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా జరిగి రెండు న్నరేళ్లు గడుస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం వైసీపీకి ప్రజల మద్దతు లభించడం లేదు.. జగన్‌ను మరోసారి అధికారంలో చూడటానికి ప్రజలు సిద్ధంగా లేరన్నది స్పష్టమవుతోంది.. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు విజయాన్ని, ప్రజల తీర్పు ను అవమానించేలా తన రోత పత్రికలో రోత రాతలు రాయిస్తు న్నారని మండిపడ్డారు.


భారతదేశంలోనే సీనియర్ రాజకీయ నాయకుడైన చంద్రబాబుపై ఇలాంటి విషప్రచారం చేయించడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చంద్రబాబుని కించపరచడమంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమే.. అలా చేస్తే అది తిరిగి ఉమ్మి వేసిన వారిపైనే పడుతుందని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని సాక్షి యాజమాన్యం గుర్తుంచుకోవాలని హితవుపలికారు.

చంద్రబాబుపై బురదజల్లడమే లక్ష్యం

చంద్రబాబు గారు 'శ్రీరామ' అని అంటే...ఆయన బూతులు మాట్లాడుతున్నారంటూ వక్రీకరించే స్థాయికి సాక్షి పత్రిక దిగజారి పోయింది. వాస్తవాలను ప్రజల కు అందించడం కంటే చంద్రబా బును ఆక్షేపించడం, తప్పుబట్టడం, కించపరచడమే లక్ష్యంగా సాక్షి పనిచేస్తోంది. 'రిపోర్టర్స్ కలెక్టివ్' అనే కొంతమంది విలేక రుల బృందం పోలింగ్ రోజున సాయంత్రం 6 గంటల తర్వాత ఓటు వేసేందుకు వచ్చిన వారికి స్లిప్పులు పంపిణీ చేస్తారని, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిబంధనల్లో వ్యత్యాసం ఉంటుం దని ఒక కథనం ప్రచురించింది. దానిని కూడా వక్రీకరించి చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఒక నివేదిక లోని అంశాలను తమకు అనుకూలంగా మలుచుకుని తప్పుడు ప్రచారం చేయడం సాక్షి పత్రికకు అలవాటుగా మారింది. ప్రజా భిప్రాయం, ప్రజాస్వామ్యంపై ఏమాత్రం విశ్వాసం లేని వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి. అదేవిధంగా వైసీపీకి కూడా ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు. పోలింగ్ రోజున ఏవైనా అక్రమాలు జరిగితే అక్కడున్న ఎన్నికల ఏజెంట్ లేదా పోలింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలి. ఫారం 17సీ అందించిన తర్వాత, సంతకాలు పూర్తయిన తర్వాత, కౌంటింగ్ కూడా ముగిసిన తర్వాత ఇలాంటి ఆరోపణలు చేయడంలో అర్థం లేదు. చంద్రబా బుపై ఉన్న అక్కసుతోనే ఈ కథనాలు రాస్తున్నారు తప్ప, వాటిలో ఎలాంటి వాస్తవం లేదు. ఈ ఆరోపణలకు చట్టపరమైన ప్రామాణి కత లేదని సీనియర్ న్యాయవాదులు సైతం స్పష్టం చేస్తున్నారు. రెండేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ గొప్పలు చెప్పు కుంటున్నారు. కానీ, ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే వైసీపీ ఘోర పరాజయాలను చవిచూస్తోంది. ఉట్టికెక్క లేనివాడు స్వర్గానికి ఎక్కుతా నన్నట్లుగా జగన్ పరిస్థితి ఉంది. ప్రజల మద్దతు లేదన్న భయంతోనే చంద్రబాబు గారి విజయంపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయిస్తూ ప్రజల తీర్పును తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

జగన్ కిరాయి రచయితలతో
తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు

- ప్రజాతీర్పును అవమానిస్తున్నారు
- రిపోర్టర్స్ కలెక్టివ్ వాళ్లు చెప్పిన 31 వేల ఓట్ల గల్లంతు అనేది పచ్చి అబద్ధం
- అంకెల గారెడీ, అభూత కల్పనతో బురదజల్లి మోసం చేయాలని చూస్తున్నారు
- ఆత్మవిమర్శ చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- జగన్‌రెడ్డిదే రక్తసిక్తమైన గెలుపు.. చీకటి గెలుపు
- చంద్రబాబుది ప్రజలిచ్చిన... ప్రజలు మెచ్చిన గెలుపు
- సాక్షి కథనంపై టీడీపీ నేత గురజాల మాల్యాద్రి కౌంటర్



మంగళగిరి(చైతన్యరథం): జగన్‌రెడ్డి తన కిరాయి రచయితలతో 2024 ప్రజాతీర్పును అవమానిస్తున్నారని టీడీపీ నేత గురజాల మాల్యాద్రి మండిపడ్డారు. నవంబరు 24న సాక్షి పత్రికలో వచ్చిన "బాబు చీకటి గెలుపు బట్టబయలు" అనే కథనా న్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రిపోర్టర్స్ కలక్టివ్ వాళ్లు చెప్పిన 31 వేల ఓట్ల గల్లంతు అనేది పచ్చి అబద్ధని పేర్కొన్న ఆయన.. ఆధారాలతో సహా సాక్షి అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంకెల గారెడీ, అభూత కల్పనతో జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి చీకటి గెలుపును చంద్రబాబుకి అంటగట్టి చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడమే జగన్ నైజమని ధ్వజమెత్తారు.

రిపోర్టర్స్ కలక్టివ్ కథనం పచ్చి అబద్ధం

రిపోర్టర్స్ కలక్టివ్ పేరుతో సాక్షిలో వచ్చిన వార్త పచ్చి అబద్ధం. ఎన్నికల అధికారులు విడుదల చేసిన గణాంకాలు, వివరాలు ప్రకారం ఎనగ్జార్ 44లో 48 కాలమ్స్ ఉంటాయి. అందులో 42 కాలమ్‌లో ప్రతి రెండు గంటలకు ఎన్నికల అధికారులు పోలింగ్ శాతం వివరాలు లెక్కిస్తారు. పోలింగ్ జరిగిన తర్వాత ఎన్నికల ఏజెంట్లకు ఫామ్ 17(సీ) పార్ట్ 1 ఇస్తారు. అందులో ఎటువంటి అభ్యంతరం ఉంటే చెప్పమని ఏజెంట్లకు ఎన్నికల అధికారులు చెబుతారు. అలానే కౌంటింగ్ రోజు ఫామ్ 17(సీ)లోని పార్ట్ 2 ఇస్తారు. అందులో ఈవీఎం, ఫామ్ 17(సీ) పార్ట్ 1లోని ఓట్ల తేడా ఉంటే చెప్పమని మరోసారి ఏజెంట్లను అడుగుతారు. ఇలా ప్రతీసారి ఏజెంట్ల సంతకాలు తీసుకునే ఎన్నికల ప్రక్రియ ముగు స్తుంది. ఇందులో అన్నీ పార్టీలకు చెందిన వేలమంది ఏజెంట్లు పాల్గొంటారు. ఇప్పుడు 2024 ఎన్నికల పోలింగ్‌పై అనేక అసత్యా లు ప్రచారం చేస్తున్న సాక్షి అప్పుడు వాటిని ఎందుకు లేవనెత్త లేదని ప్రశ్నించారు.

ఫామ్ 17(సీ) పార్ట్ 1,2లపై ఎందుకు సంతకాలు పెట్టారు

వైసీపీ పార్టీకి చెందిన ఏజెంట్లు ఫామ్ 17(సీ) పార్ట్ 1,2లపై ఎందుకు సంతకాలు పెట్టారు. ఇప్పుడు ఓట్ల తేడా విషయంలో రిపోర్టర్స్ కలెక్టివ్ చెప్పినవి పచ్చి అబద్ధాలు. అధికారిక లెక్కల ప్రకారం చిత్తూరు పార్లమెంట్ పరిధిలో ఎంపీ అభ్యర్థులకు పోల్ అయిన మొత్తం ఓట్లు 14,60,881 ఓట్లు. పార్లమెంట్ పరిధిలో ఉండే మొత్తం ఎమ్మెల్యేలకు పోలైన ఓట్లు 14,60,974 ఓట్లు అంటే వాటి మధ్య ఉన్న తేడా కేవలం 93 మాత్రమే. అలానే కుప్పం నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యేకి మధ్య వచ్చిన పోలింగ్ తేడా కేవలం 294 మాత్రమే. సాక్షి పత్రిక, వైసీపీ నాయకులు మాత్రం అక్కడ ఏదో జరిగిపోయిందనే అభూత కల్పన సృష్టిస్తున్నా రు. అలానే సాయంత్రం 5 గంటల తర్వాత క్యూ లైన్లలో నిలుచు న్న వారికి 56 వేల ఓటర్ల స్లిప్స్ ఇచ్చామని చెప్పడం పచ్చి అబద్ధం. కేవలం 9,600 మాత్రమే ఇచ్చారు. అలానే 2024 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల తర్వాత రాత్రి సమయానికి ఓట్ల తేడా కేవలం 13.82 శాతం మాత్రమే. 2019లో కూడా ఇలానే 13.8 శాతం వచ్చింది. ఇలా కల్పిత లెక్కలు, అంకెల గారిడీతో ప్రజలను జగన్‌రెడ్డి తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపును ఓర్వలేక తప్పుడు ప్రచారం

2024 ఎన్నికలపై ఇంతలా అసత్యాలు ప్రచారం చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి అప్పుడు ఆపధర్మ ముఖ్యమంత్రిగా పనిచేసింది ఎవరో గుర్తుంచుకోవాలి. అలానే చిత్తూరులో పెద్దిరెడ్డి కన్నుసన్న లోనే కాదా అప్పటి కలెక్టర్ పనిచేశారు. రాష్ట్రంలో మొత్తం 25 పార్లమెంట్ స్థానాలు ఉంటే కేవలం చిత్తూరు పార్లమెంట్ మాత్రమే ఎందుకు టార్గెట్ చేశారు. అందులోనూ కుప్పం నియోజకవర్గాన్నే మాత్రమే ఎందుకు ఎంచుకున్నారు. స్థానిక సంస్థల్లో కూటమి పార్టీలకు వస్తున్న ఆధారణ గెలుపును చూసి ఓర్వలేక జగన్మోహ న్‌రెడ్డి భయపడి తమ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నెలకొల్పడానికి ఇలా రాయిస్తున్నారు. అలానే ఆడబిడ్డల ఆస్తిని కొట్టేస్తున్న జగన్ రెడ్డిని రాష్ట్ర మహిళలు అసహ్యించుకుంటున్నారు. ఇలాంటి అంశా లన్నీ పక్కదారి పట్టించడానికి ఇప్పుడు తన సాక్షిలో అసత్య కథనా లు రాయిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ప్రజా తీర్పును గౌరవించని జగన్‌రెడ్డికి భవిష్యత్‌లో సింగిల్ డిజిట్ ఖాయం

ఈవీఎం, బ్యాలెట్ బాక్స్ అయినా కూటమి వైపే ప్రజలు ఉన్నారు. ఫేక్ వైబ్‌సైట్‌లో అసత్య కథనాలు రాయించి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో 25 శాతం ఓట్లతో వైసీపీ బొక్కబోర్లా పడింది. కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికే ఇలాంటి కథనాలతో కాలం గడుపుతున్నారు. పిల్లికి ఎలుక సాక్ష్యం అన్నట్లు సాక్షి అబద్ధపు రాతలకు రిపోర్టర్స్ కలెక్టివ్ తోడుగా నిలు స్తుంది. జగన్‌రెడ్డిదే రక్తసిక్తమైన గెలుపు... చీకటి గెలుపు. చంద్రబాబుది ప్రజలిచ్చిన గెలుపు..ప్రజలు మెచ్చిన గెలుపు. 2019 ఎన్నికల ఓటమిని చంద్రబాబు అంగీకరించారు. ప్రజా తీర్పును గౌరవించారు. కానీ ఇప్పుడు జగన్‌రెడ్డి తన ఓటమిని ప్రజలు, ఈవీఎంలపై నెడుతున్నారు. ప్రజాతీర్పును గౌరవించని ఆయనకు భవిష్యత్‌లో సింగిల్ డిజిట్ ఖాయం. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న గొడ్డలి మురా

- 2023లోనే కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ఆంజనేయపురం గుడి తరలింపునకు చర్యలు
- ప్రజల బాధలు చూడలేక ఆ రాముడే ఏపీని ఎప్పుడో జగన్ నుంచి కాపాడాడు
- తీర్థప్రసాదాలు స్వీకరించని ఆయనకు రాముడి పేరు పలికే అర్హత లేదు
- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు ధ్వజం

మంగళగిరి(చైతన్యరథం): కేవలం రాజకీయ స్వార్థం కోసం మత విద్వేషాలను రెచ్చగొడుతూ సాక్షి పత్రికను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మంగళగిరి తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ ఆంజనేయపురంలోని ఆంజనేయ స్వామి ఆలయ తరలింపు వ్యవహారంలో వాస్తవాలను దాచిపెట్టి హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-716) నిర్మాణ అవసరాల కోసం 2023లో గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఆనాడు స్థానిక ఎమ్మెల్యేగా, టీటీడీ చైర్మన్‌గా ఉన్న కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ తరలింపునకు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. అప్పట్లో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారి ద్వారా భూసేకరణ అవార్డు కేటాయించారని స్పష్టం చేశారు. కనీసం ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించకుండా నేడు ఏమీ తెలియనట్లు అబద్ధాలతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

భక్తుల మనోభావాలను గౌరవిస్తూ తాత్కాలిక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సనాతన ధర్మాన్ని, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆంజనేయపురం గ్రామస్తులు, ఆలయ అర్చకుల సమక్షంలో ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం అత్యంత భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని తాత్కాలిక ఆలయంలోకి తరలిం చి ప్రతిష్ఠించామని వివరించారు. గత ప్రభుత్వం గాలికొదిలేసిన ఆలయ నిర్మాణానికి రూ.59 లక్షలకు పైగా నిధులను మంజూరు చేసి ఆలయ ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించామని గుర్తు చేశారు. గ్రామస్తులు, పూజారులు ఇప్పుడు ఎంతో సంతోషంగా నూతన ఆలయ నిర్మాణ పనులు చేసుకుంటున్నారని తెలిపారు. ఇది 70 ఏళ్ల క్రితం గ్రామస్తులు ప్రతిష్ఠించుకున్న ఆలయమే తప్ప స్వయంభువు విగ్రహం కాదని, అభివృద్ధి పనుల కోసం అందరి అంగీకారంతోనే తరలింపు జరిగిందని స్పష్టం చేశారు. గతంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి రోజుకు 50 వేల మంది, వారాంతాల్లో లక్ష మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం కొన్ని నిర్మాణాలు తొలగిస్తే... నాడు కూడా గుడులు కూల్చేశారంటూ వైసీపీ నేతలు ఇదే తరహాలో విషం చిమ్మారని గుర్తుచేశారు.

గత ప్రభుత్వంలో 300కు పైగా ఆలయాలపై దాడులు

గత వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా దేవాల యాలపై దాడులు జరిగితే ఏనాడూ 'హే రామ్' అని పలకని జగన్మోహన్‌రెడ్డికి నేడు కొత్తగా రాముడు గుర్తుకురావడం విడ్డూ రంగా ఉందని ఎద్దేవా చేశారు. నాడు రామతీర్థంలో రాములవారి విగ్రహం తల నరికితే "ఇంకో విగ్రహం పెట్టుకోవచ్చు కదా", అంతర్వేది రథం తగలబడితే "కొత్త రథం చేయించుకోవచ్చు కదా" అని వైసీపీ నేతలు అహంకారపూరితంగా మాట్లాడిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. నాడు ఒక్క ఆలయాన్ని కూడా జగన్ సందర్శించలేదని మండిపడ్డారు.



అర్చకులు ఇచ్చిన తీర్థాన్ని తాగ కుండా కింద పారబోయడం, దేవుడి ప్రసాదాన్ని ఇంటి లోపలికి రానివ్వకపోవడం, తిరుమల బస్సు టికెట్లపై అన్యమత ప్రచారం చేయడం, కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని 'నల్లరాయి, చెప్పుతో కొట్టినా తప్పేంటి' అని అవమానించిన వ్యక్తులను టీటీడీ చైర్మన్లుగా నియమించిన పాపం వైసీపీదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అపచారం చేశారు.. అందుకే ఓడగొట్టారు

దేవాలయాలపై జరిగిన అపచారాల వల్లే 2024 ఎన్నికల్లో ఆ రాములవారు వైసీపీకి కనీవినీ ఎరుగని రీతిలో ఘోర పరాజయా న్ని కట్టబెట్టారని వ్యాఖ్యానించారు. హిందూ, క్రైస్తవ, ఇస్లాం సహా అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నేతల అబద్ధాలు, దౌర్జన్యాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మే స్థితిలో లేరని, తప్పుడు ప్రచారాలు చేసే కొద్దీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు మత విద్వేషాలు రెచ్చగొట్టే నీచ రాజకీయాలు మానుకుని ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని హితవు పలికారు.

నాడు గ్రామీణ తిరోగతి...

నేడు గ్రామీణ ప్రగతి

- కూటమి ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం
- గత వైసీపీ పాలనలో నిధులు దారిమళ్లించారు
- టీడీపీ నేత ఎస్.వీ.ఎస్.ఎన్.వర్మ



మంగళగిరి(చైతన్యరథం): గత పాలనలో పంచాయతీ నిధుల దుర్వినియోగం, రోడ్ల నిర్లక్ష్యం, సర్పంచుల అధికారాల క్షీణత కారణంగా గ్రామీణ ప్రాంతాలు తిరోగమనం పాలయ్యాయని టీడీపీ నేత ఎస్.వీ.ఎస్.ఎన్.వర్మ అన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయ న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యాన్ని బలపరుస్తూ అవసరమైన నిధులు,అధికారాలు, మౌలిక సదుపాయాలు అందిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రూ.9వేల కోట్ల పంచాయతీ నిధులు దారిమళ్లించి కనీసం గ్రామ పం చాయతీల కరెంటు బిల్లులు కూడా కట్ట లేని పరిస్థితి తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో 15ఆర్థిక సంఘం నిధు లు కూడా పెండింగ్ పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ఆర్థిక సంఘం నిధులు రూ.4,200 నేరుగా పంచాయతీలకు జమచేసి గ్రామస్థాయి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధి

గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, పరిశుభ్రత, ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గ్రామానికి గ్రామానికి అనుసంధానం, గ్రామ లోపల సంపర్క రోడ్లు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు, రైతులు, వృద్ధులకు సురక్షిత ప్రయాణ సౌక ర్యం అందించడం జరుగుతోంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి 'అడవి తల్లి బాట'కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతా ల్లో రహదారులు వేయడం జరుగుతోంది.

పరిశుభ్రత-పబ్లిక్ ఆరోగ్యం

గ్రామాల్లో చెత్త నిర్వహణ, డ్రైనేజీ శు భ్రత, సానిటేషన్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అంటువ్యాధులు నియం త్రించడం, చెత్త పేరుకుపోకుండా చూడటం, పర్యావరణ పరిశుభ్రత కాపాడటం ద్వారా ఆరోగ్యకరమైన గ్రామాలను ఏర్పాటు చేయడమే లక్ష్యం. 'స్వచ్ఛాంధ్రప్రదేశ్' కార్యక్రమాల ద్వారా గ్రామీ ణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యకలాపాలు నిరంతరం నిర్వహిస్తున్నారు.

ఉపాధి హామీ పథకం

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు, చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంత లు, కాలువ శుద్ధి, వ్యవసాయ సంబంధ పనులు చేపట్టడం జరుగుతోంది. పని దినాలు 125 రోజులకు పెంచి వేతనాలు సకాలంలో పారదర్శకంగా ప్రాధాన్యత ఇస్తోంది. ఇది పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత, వ్యవసాయ మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

వ్యవసాయం-సాగునీరు

ధాన్యం కొనుగోలులో రైతులకు 24 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలల్లో జమ చేయడం జరుగుతోంది. గత ప్రభుత్వంలో రైతులకు సకాలంలో డబ్బులు జమ అయిన పరిస్థితి లేదు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, ఎత్తిపోతల ద్వారా నీటి ప్రవాహం, 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం కూటమి ప్రభుత్వం లక్ష్యం.

విద్యా రంగ అభివృద్ధి

గ్రామీణ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెగా డీఎస్సీ ద్వారా 1650 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చాం. పాఠశాలల్లో పిల్లల సౌకర్యాలు, యూనిఫారం, బ్యాగ్, షూ వంటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పేరెంట్స్-టీచర్ మీటింగ్స్ ద్వారా పిల్లల పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

ప్రజల సహకారం అవసరం

గ్రామీణ ప్రగతిని మరింత వేగవంతం చేయడానికి ప్రజల సహకారం అవసరం. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి దృష్టితో ఓటు వేయాలని, గ్రామ స్వరాజ్యాన్ని బలపరిచే నాయకులకు అవకాశం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి సాధ్యమ వుతుంది. ప్రజా సేవ, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అంకితమై ఉందని స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికల్లో

సామాజిక న్యాయానికి పట్టాభిషేకం

- సామాజిక హితం, న్యాయమే కూటమి అభిమతం
- ఏపీ సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య



మంగళగిరి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ విశ్రమించకుండా రాష్ట్ర అభివృద్ధి, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు కృషి చేస్తున్నారని ఏపీ సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య పేర్కొన్నారు.

టీడీపీ కేంద్రం కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవ ల జరిగిన నగర కార్పొరేషన్, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలలో కూటమి ప్రభుత్వానికి అజేయమైన విజయాన్ని అందించారన్నారు. ఈ సంస్థాగత పదవులలో 28 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లలో ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, 659 జడ్పీటీసీలలో ఎస్సీలకు 127, ఎస్టీలకు 57, 624 మండల పరిషత్ అధ్యక్ష పదవులలో ఎస్సీలకు 121, ఎస్టీలకు 46, అలాగే 123 నగర/మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఎస్సీలకు 16, ఎస్టీలకు 4 పదవులు కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ల కోసం సుమారు రూ. 2,700 కోట్లు జమ చేస్తూ ఇప్పటివరకు పెన్షన్లకే రూ.79 వేల కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. అన్న క్యాంటీన్ల ద్వారా కోట్లాది మందికి భోజనం అందిస్తోందని తెలిపారు. రాప్తాడులో గాయపడిన పదో తరగతి విద్యార్థినికి మంత్రి లోకేష్ తక్షణమే స్పందించి బెంగళూరు ఆసుపత్రిలో సుమారు రూ.39 లక్షల వ్యయంతో చికిత్స చేయించారన్నారు.

ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా హాస్టళ్ల తనిఖీలు, డ్రగ్స్-గంజాయిపై ర్యాలీలు, విద్యార్థులను అసెంబ్లీకి తీసుకెళ్లడం, ఉత్తరాంధ్ర సంక్షేమ యాత్ర, 'విద్యార్థిని జరభద్రం' వంటి కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ నాలుగో అంతస్తులోని కార్యాలయంలో ప్రతి బుధవారం 'సామాజి క దర్బార్' నిర్వహిస్తూ బడుగు, బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలను ప్రజలు మర్చిపోలేదని, నేడు కొందరు చేసే దుష్ప్రచారాలను తిప్పికొడుతూ సామాజిక హితం, సామాజిక న్యాయమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతోందని చెప్పారు.

రిపోర్టర్స్ కలెక్టివ్ పేరుతో

ప్రజాతీర్పును సాక్షి అవమానించింది

- అందులో ఉన్న మయాంక్ అగర్వాల్ గతంలోనూ అమరావతిపై విషప్రచారం చేశారు
- 2024 ఓటింగ్ శాతంపై అనుమానాలు ఉంటే ఫామ్ 17(సీ) పార్ట్ 1,2లపై వైసీపీ ఏజెంట్లు ఎందుకు సంతకాలు పెట్టారు
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ఎన్.విజయ్‌కుమార్



మంగళగిరి(చైతన్యరథం): ఊరు పేరు లేని చిన్న వెబ్‌సైట్ తీసుకొచ్చి 2024 ప్రజాతీర్పును జగన్‌రెడ్డి అగౌరవ పరుస్తున్నా రని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ మండిపడ్డారు. గతంలో అమరావతిపై విషప్రచారం చేయించిన మయాంక్ అగర్వాల్ పనిచేస్తున్న ఆ సంస్థే మరోసారి 2024 ఎన్నికలపై అసత్యాలు ప్రచారం చేస్తుందని దుయ్య బట్టారు. మయాంక్ అగర్వాల్ 'రిపోర్టర్స్ కలెక్టివ్' అనే సంస్థలో చేరి, మరో ఇద్దరిని తోడు చేసుకుని ఇలా అసత్య కథనాలు రిపోర్టులతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల పోలింగ్‌పై ఇప్పు డు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు ఇంతవరకు కోర్టులకు ఎందుకు వెళ్లలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల తీరుపై అభ్యంతరాలు ఉంటే పోలింగ్, ఎన్నికల అనంతరం అధికారులు ఇచ్చిన ఫామ్ 17(సీ) పార్ట్ 1, 2లపై ఆ పార్టీ ఏజెంట్లు ఎందుకు సంతకాలు పెట్టారని నిలదీశారు.

రెండున్నరేళ్ల తర్వాత ఎందుకు గుర్తొచ్చింది

"నవంబరు 24న సాక్షిలో వచ్చిన కథనంతో పాటు వైసీపీ నాయకులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు మేము సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం. 'ఫామ్ 17సీ' ఎన్నికల ప్రక్రియలో ఇది ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీత వంటిది. పోలింగ్ బూత్‌లో ఉండే ప్రతిఒక్కరికీ దీని ప్రాముఖ్యత తెలుస్తుంది. మనం ఓటు వేయడానికి బూత్‌లోకి వెళ్లగానే ఏజెంట్ నమోదు చేసుకుంటారు. ఆ తర్వాత స్లిప్ ప్రక్రియ పూర్తయ్యాక అధికారులు కూడా నోట్ చేసుకుంటారు. మనం వెళ్లి ఈవీఎంలో ఓటు వేయగానే అందు లో రికార్డ్ అవుతుంది. సాయంత్రం పోలింగ్ ముగిశాక ఏజెంట్ల దగ్గర ఉన్న లెక్క అంటే ఎంతమంది ఓటు వేశారు అనేది ఈవీఎం లెక్కతో కచ్చితంగా సరిపోవాలి. సరిపోకపోతే అసలు ఆ ఎన్నికల ప్రక్రియే ముందుకు వెళ్లదు. అందుకే ఫామ్ 17సీ అంత కీలకం. ఆ ఫామ్ 17సీ ప్రకారం చూస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 46,800 బూతుల్లో పనిచేసిన వైసీపీ ఏజెంట్లెవరూ అప్పుడు ఏ అభ్యంతరమూ చెప్పలేదు. అలాగే చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సుమారు 1,400 నుంచి 1,600 బూతు ల్లో ఉన్న వైసీపీ ఏజెంట్లెవరూ అప్పుడు ఏమీ అడగలేదు. రెండున్న ర ఏళ్ల తర్వాత జగన్‌రెడ్డికి ఇప్పుడు గుర్తుకొచ్చిందని ప్రశ్నించారు.

జగన్‌రెడ్డి పెంచిపోషించిన జర్నలిస్టులే ఈ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు

పోలింగ్ జరిగిన రోజుతోనే ఎన్నికల ప్రక్రియ అయిపోదు. మరుసటి రోజు కేంద్ర ఎన్నికల పరిశీలకులు, అబ్జర్వర్ల సమక్షం లో 'ఫామ్ 17సీ పార్ట్-2' పరిశీలన చేస్తారు. ఆ రోజు కూడా వైసీపీ వాళ్లు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. ఆ తర్వాత మూడో రోజు తుది ఓటింగ్ శాతం ప్రకటించే ప్రక్రియ జరుగుతుంది. చిత్తూరు నియోజకవర్గంలో అందులోనూ కుప్పం అసెంబ్లీ నియో జకవర్గంలో ఈ దశలన్నింటిలోనూ ఎవరూ ఎలాంటి అభ్యంతరం లేవనెత్తలేదు. ఇక ఓట్ల లెక్కింపు రోజున ఫామ్ 17సీ పార్ట్-2తో ఈవీఎం ఓట్ల లెక్కను సరిచూస్తారు. చిత్తూరు పరిధిలోనే సుమారు 1,600 మంది వైసీపీ ఏజెంట్లు ఉన్నా..ఒక్క ఓటు తేడా రాకపో యినా ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లో తుది ఇండెక్స్ కార్డు ఈ రోజుకీ అందరికీ అందుబాటులో ఉంది. ఫలితాలు వచ్చాక కూడా నిబంధనల ప్రకారం 45 రోజుల్లోగా కోర్టుకు వెళ్లాల్సింది పోయి ఒక్క పిటిషన్ కూడా వేయలేదు. రెండున్నర ఏళ్ల తర్వాత జగన్‌రెడ్డి పెంచి పోషించిన జర్నలిస్టులు ఉన్న ఓ చిన్న వెబ్‌సైట్ ద్వారా ఏదో ఒక చిన్న క్లరి కల్ లోపాన్ని పట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యం ఉంటే ఇప్పుడైనా కోర్టుకు వెళ్లండి. కోర్టులో సవా ల్ చేసి స్ట్రాంగ్‌రూమ్‌లు ఓపెన్ చేయించే ధైర్యం మీకు ఎక్కడుం ది? చిత్తూరులోని ఏడు సెగ్మెంట్లలోనూ 17సీ లెక్కకు, ఈవీఎం ఓట్లకు వంద శాతం సరిపోయాయి. అలానే 2024లో అధికారం లో ఉన్నది వైసీపీ పార్టీ కాదా? అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా అరాచకాలు చేసింది కూడా ఆ పార్టీ నాయకులే కాదా? అని నిలదీశారు.

దేశంలో 'సర్క్యులర్ ఎకానమీ' పాలసీ

ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్

- రీసైక్లింగ్ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం
- అందువల్లే పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి
- త్వరలో ప్రజల నుంచి వ్యర్థాల కొనుగోలు
- స్వచ్ఛాంధ్ర చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్
- 3వ ప్రపంచ మేయర్ల ఫోరమ్ సదస్సుకు హాజరు

ముంబై(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో దేశంలో మొట్టమొదట 'సర్క్యులర్ ఎకానమీ' పాలసీని ప్రవేశపెట్టి న రాష్ట్రం ఏపీ అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ముంబైలోని హోటల్ ఫెయిర్‌మాంట్‌లో బుధవారం జరిగిన 3వ ప్రపంచ మేయర్ల సదస్సులో 'సర్క్యులర్ సిటీస్' అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ (ఏఐఐ ఎల్ఎస్‌జీ) శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో వరల్డ్ మేయర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. మహా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో సుమా రు 30 దేశాల నుంచి 200కు పైగా నగరాలకు చెందిన మేయ ర్లు, మున్సిపల్ కమిషనర్లు, విధాన రూపకర్తలతో సహా 500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో పట్టాభిరామ్ మాట్లాడుతూ 'సర్క్యులర్ ఎకానమీ' ద్వారా తాము రీసైక్లింగ్ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ రంగానికి భూమి కేటాయింపులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు, ప్రత్యేకమైన నిర్వహణ రాయితీలు, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి మద్దతు, 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' (ప్రాజెక్ట్ సాధ్యత కోసం ఆర్థిక సహాయం) వంటి అనేక రకాల ప్రోత్సాహకాలను తాము అందిస్తు న్నట్లు వివరించారు. ఈ సర్క్యులర్ ఎకానమీ విధానంలో ఉన్న ఆకర్షణీయమైన అంశాల వల్ల ఇప్పుడు అనేక రీసైక్లింగ్ పరిశ్ర మలు తమ రాష్ట్రానికి వస్తున్నట్లు తెలిపారు. తాము నాలుగు 'సర్క్యులర్ ఎకానమీ పార్కులను' కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.



వ్యర్థాల విభజన.. స్వచ్ఛ రథం కార్యక్రమం

ప్రజలు తమ ఇళ్ల వద్దే వ్యర్థాలను వేరు చేసేలా వారిని ఎలా ప్రోత్సహించాలనే దానిపై తమ వద్ద ఒక పరిష్కారం ఉందని చెప్పారు. వ్యర్థాల విభజన లేకపోతే సర్క్యులర్ ఎకానమీ సాధ్యం కాదని, రీసైక్లింగ్ కూడా జరగదని తెలిపారు. అందువల్ల ప్రజల నుంచి వ్యర్థాలను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహిం చే ఒక ఆలోచనతో తాము ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. దీని కోసం 'స్వచ్ఛరథం'(మొబైల్ వ్యాన్) అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇది ప్రతి వార్డుకు, ప్రతి చిన్న మున్సిపాలిటీకి లేదా గ్రామానికి వెళ్లి ప్రజల నుంచి వ్యర్థాలను సేకరిస్తుందని తెలిపారు. ప్రస్తుతం తాము గృహాల నుంచి నేరుగా 12 రకాల వ్యర్థాలను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఈ 'స్వచ్ఛరథాల' ద్వారా సుమారు 118 టన్నుల వ్యర్థాలను సేకరిం చినట్లు తెలిపారు. దీనికి ప్రతిఫలంగా, ఆయా గృహాల్లోని మహిళలకు సుమారు 16 కోట్ల రూపాయల విలువైన నిత్యా వసర వస్తువులను అందించామన్నారు. ఇది అద్భుతమైన విజ యాన్ని సాధించినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రజలు చాలా బాధ్యతా యుతంగా వ్యర్థాలను వేరు చేస్తున్నారని చెప్పారు.

త్వరలో అందుబాటులోకి గ్రీన్‌షాపులు

ఆంధ్రప్రదేశ్‌లోని నగరాల్లో త్వరలో గ్రీన్ షాపులు అందుబా టులోకి రానున్నాయని చెప్పారు. ఇక్కడ ప్రజలు తమ వ్యర్థాలను తీసుకువచ్చి విక్రయించవచ్చని, ప్రభుత్వం వాటిని కొనుగోలు చేస్తుందని వివరించారు. వ్యర్థాల సేకరణలో నిమగ్నమైన వ్యక్తుల ను (ర్యాగ్ పికర్స్), పారిశుధ్య కార్మికులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పునర్వి నియోగం (రీసైక్లింగ్) చేయదగిన పదార్థాలను సేకరించడంలో వీరు అత్యంత కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. తమ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో రీసైక్లింగ్ పరిశ్రమల కోసం ఒక వ్యవస్థీకృత సరఫరా గొలుసును ఏర్పాటు చేయబోతున్నా మని వివరించారు. ఇందులో వ్యర్థాలను సేకరించే వ్యక్తులు కూడా భాగస్వాములుగా ఉంటారని చెప్పారు. ఈ మొత్తం సరఫ రా గొలుసును డిజిటలైజ్ చేయబోతున్నామని, దీని ద్వారా ఒక ప్లాస్టిక్ బాటిల్ ఏ పట్టణం లేదా నగరంలో సేకరించారు, ఎవరి ద్వారా సేకరించారు, అది రీసైక్లింగ్ ప్లాంట్‌కు ఎలా చేరుకుంది అనే విషయాలను ట్రాక్ చేయవచ్చని వివరించారు. ఒక రియల్-టైమ్ డాష్‌బోర్డ్ ద్వారా ఏ ప్రాంతంలో ఎలాంటి వ్యర్థ పదార్థాలు అందుబాటులో ఉన్నాయో రీసైక్లింగ్ పరిశ్రమలు తెలుసుకోగల వన్నారు. ఇటువంటి ప్రయత్నాలు 'సర్క్యులర్ ఎకానమీ' భావనను ప్రోత్సహించడంలో ఎంతో సహాయపడతాయని చెప్పారు.

రాష్ట్రంలో పెద్దఎత్తున వ్యర్థాల శుద్ధి కేంద్రాలు

రాష్ట్రంలో వ్యర్థాల శుద్ధి కేంద్రాలు(ప్రాసెసింగ్ సెంటర్స్) పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం, ఏపీలో 108 వ్యర్థాల శుద్ధి ప్లాంట్లు, ఆరు వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటు చేయడానికి రూ.550 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 'డంప్ యార్డులు లేని రాష్ట్రం'గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను అదే రోజున పూర్తిగా ప్రాసెస్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారని వివరించారు. ఇక్కడే 'సర్క్యులర్ ఎకానమీ' ప్రాధా న్యత మొదలవుతుందని చెప్పారు.

పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం

పారిశుధ్య కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధా న్యత ఇస్తూ వారిని చైతన్య పరచడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతినెలా మూడవ శనివారం 'స్వర్ణాంధ్ర – స్వ చ్ఛాంధ్ర' కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లు చెప్పారు. స్వచ్ఛత కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర పోషించే వారిని గుర్తించి వారికి స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రకటిస్తున్నారని తెలిపారు. అందు వల్లే రాష్ట్రానికి వివిధ కేటగిరీల్లో మొత్తం ఆరు జాతీయ అవార్డులు లభించాయని చెప్పారు. పట్టాభిరామ్‌ను ఏఐఐఎల్ఎస్‌జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ స్నేహా పల్నిత్కర్, వివిధ దేశాల ప్రతినిధులు అభినందించారు.

చైతన్యరథం

నేడే తొలివిడత పంచాయతీ పోరు

- అధికార యంత్రాంగం సర్వం సిద్ధం
- 3,240 గ్రామాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు
- ఇదే రోజు కౌంటింగ్...ఫలితాల వెల్లడి
- 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఎన్నికలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం 26 జిల్లాల్లోని 3,240 పంచాయతీలకు ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఉద యం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి.. ఫలితాలను ప్రకటించనున్నారు. ఏకగ్రీవా లు మినహా 3,240 పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలివిడతలో 709 పంచాయతీలు ఏకగ్రీవమైన సంగతి తెలిసిందే. తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 31,614 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ దశ ఎన్నికల్లో 74.45 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. విశాఖపట్నం, గుంటూరు జిల్లాలు మినహా ఇతర జిల్లాల్లో ఈ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,167 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో నవంబరు 26, 29, డిసెంబరు 2 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ తొలి విడత పంచాయతీ ఎన్నికలతో పాటే తుది దశ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



రెండో విడత 23 పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్

ఏపీలో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు గురువా రమే జరగనున్నాయి. నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సి పాలిటీలు/ నగర పంచాయతీలు కలిపి మొత్తం 23 యూఎల్‌బీ లకు ఎన్నికలను నిర్వహించనున్నారు. 4 మేయర్ స్థానాలు, 19 చైర్‌పర్సన్ స్థానాలు కలిపి మొత్తం 23 పదవులకు ఎన్నికలు జర గనున్నాయి. వీటిలో ఏదీ ఏకగ్రీవం కాకపోవడంతో అన్ని స్థానాలకు పోలింగ్ జరుగనుంది. 4 మేయర్ పదవుల కోసం 36 మంది, 19 చైర్‌పర్సన్ పదవుల కోసం 134 మంది కలిపి మొత్తం 170 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 1,010 వార్డు సభ్యుల స్థానాల్లో 41 వార్డులు ఏకగ్రీవం అవగా.. మరో 5 వార్డు ల్లో పోటీ లేకపోవడంతో 964 వార్డులకు పోలింగ్ నిర్వహించ నున్నారు. 4 కార్పొరేషన్లలో 2 వార్డులు, 19 మున్సిపాలిటీలు /నగ ర పంచాయతీల్లో 39 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మేయర్ /చైర్‌పర్సన్ ఎన్నికల కోసం 1,009 వార్డుల్లో ఎన్నికలు జరుగను న్నాయి. కార్పొరేషన్ వార్డుల్లో 911 మంది, మున్సిపల్ వార్డుల్లో 2,057 మంది కలిపి మొత్తం 2,968 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు బరిలో నిలిచారు.

24,98,312 మంది ఓటర్లు

23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 24,98,312 మంది ఓటర్లు కాగా.. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధి కంగా ఉన్నారు. 12,04,819 మంది పురుష ఓటర్లు ఉండగా.. మహిళా ఓటర్లు 12,93,084 మంది ఉన్నారు. అలాగే ఇతరులు 409 మంది ఉన్నారు. మొత్తం 2,801 పోలింగ్ కేంద్రాలను నోటిఫై చేయగా.. ఏకగ్రీవ వార్డులను మినహాయించగా 2,698 కేంద్రాల్లో పోలింగ్‌ను నిర్వహించనున్నారు. 819 సమస్యాత్మక, 597 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించి ఆ ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఒక్కో కేంద్రానికి రెండు చొప్పున 5,602 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల వద్ద అదనంగా మరో 183 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పోలింగ్ సిబ్బంది నియామకం

అలాగే 3,362 మంది ప్రిసైడింగ్ అధికారులు, 3,531 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 12,831 మంది ఇతర సిబ్బం ది పోలింగ్ విధుల్లో ఉండనున్నారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం 302 మంది రిటర్నింగ్/ఎన్నికల అధికారులు, 378 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 142 మంది జోనల్ అధికారు లు, 351 మంది రూట్ అధికారులను నియమించారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కోసం 23 కేంద్రాలు, 115 కౌంటింగ్ హాళ్లు, 842 టేబుళ్లను సిద్ధం చేశారు. లెక్కింపు ప్రక్రియకు 842 మంది సూప ర్‌వైజర్లు, 2,526 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించారు.

నిర్భయంగా ఓటేయండి: ఎస్ఈసీ

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితమైన అమలుకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. ఎలాంటి ప్రలోభాలు, భయాలకు లోనుకాకుం డా ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

అమరావతికి ప్రపంచబ్యాంకు, ఏడీబీ బృందం

- రివర్‌ఫ్రంట్ ప్రాంతాల సందర్శన
- రాజధానిలో అభివృద్ధి పనులపై సంతృప్తి



అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ (ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్) ప్రతినిధుల బృందం బుధవారం పర్యటించింది. రాజధానిలో పనుల పురోగ తిని పరిశీలించింది. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, అదనపు నిధుల విడుదలపై సమీక్ష నిర్వహించింది. భవిష్యత్ కార్యాచరణ, ప్రాజెక్టుల పురోగతిపై సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారు లతో చర్చలు జరిపింది. సామాజిక భద్రత, పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత లాంటి అంశాలను ప్రతినిధుల బృందం ప్రత్యే కంగా సమీక్షించింది. ఈ సందర్భంగా రాజధాని రైతుల ఫిర్యాదు లు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధులు ఆరా తీశారు. వైకుంఠపురం పంపింగ్ స్టేషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమరావతిలో రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేయనున్న ప్రాంతాలను సందర్శించారు. కృష్ణా కరకట్ట ఈ-1 రహదారి, మందడం పంచాయతీలో అభివృద్ధి పనులపై పరిశీలన చేపట్టారు. సీడ్ యాక్సిస్ ఈ-3 రహదారి రెండు, మూడు దశల పనులపై ఆ ప్రతినిధులు క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతి పనుల పురోగతిపై ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు.

అన్ని కాలేజీల్లో రాజ్యాంగ దినోత్సవం
ఏపీ ఇంటర్ బోర్డు ఆదేశం



అమరావతి(చైతన్యరథం): ఏపీలోని అన్ని జూనియర్ కళాశాలల్లో గురువారం 'రాజ్యాంగ దినోత్సవ' వేడుకలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా ప్రకటించారు. ఈ వేడుకల నిర్వహణలో అలసత్వం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని డీఐఈవో, డీవీఈవో, ఆర్ఐవోలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వేడుకలను గురువారం ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్, సంక్షేమ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, కాంపోజిట్ డిగ్రీ కళాశాలల్లో తప్పనిసరిగా ఈ వేడుకలు జరపాలని స్పష్టం చేశారు. గురువా రం ఉదయం 11:00 గంటలకు విద్యార్థులు, అధ్యాపకులతో భారత రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేయించాలని ఆజ్ఞాపించారు. MyGov పోర్టల్ ద్వారా 23 భాషల్లో ఆన్‌లైన్ పీఠిక పఠనంలో పాల్గొనాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. MYBharat, MyGov పోర్టల్స్ ద్వారా నిర్వహిస్తున్న రాజ్యాంగ క్విజ్‌లో విరివిగా పాల్గొనాలని సూచించారు. 'వికసిత్ భారత్ యువ సంవాద్' కార్యక్రమంలో యువత భాగస్వామ్యం వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా పేర్కొన్నారు.

సకాలంలో జాతీయ ప్రాజెక్టులు పూర్తి చేయాలి





- పీఎం సేతు సమర్థవంతంగా అమలుకు చర్యలు
- రాష్ట్రాల సీఎస్‌లకు ప్రధాని మోదీ దిశానిర్దేశం
- పీఎం ప్రగతిపై వీడియో సమావేశం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రాలలో ప్రగతి కింద చేపట్టిన పలు జాతీయ ప్రాజెక్టులు సహా పీఎం సేతు పథకంపై బుధవారం ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన పలు జాతీయ ప్రాజెక్టులను నిర్దేశి త గడువు ప్రకారం సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శు లను ఆదేశించారు. అదేవిధంగా పీఎం సేతు పథకాన్ని పటిష్టంగా అమలు చేయడం ద్వారా యువతకు మెరుగైన నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని ఆదేశించారు. పీఎం సేతు పథకం అనేది దేశంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునికీకరించి యువ తకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక ప్రతిష్టాత్మక పథకం. అక్టోబర్ 4, 2025న ప్రారంభమైన ఈ పథకం కోసం ఐదేళ్ల కాలానికి రూ.60,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. (కేంద్రం రూ.30,000 కోట్లు, రాష్ట్రాలు రూ.20,000 కోట్లు, పరిశ్రమ భాగస్వాములు రూ.10,000 కోట్లు భరిస్తాయి. హబ్-అండ్-స్పోక్ విధానంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఈ పథకం కింద ఆధునీకరిస్తారు. వీటిలో 200 ఐటీఐలను ప్రధాన కేంద్రాలుగా వాటికి అనుబంధంగా మరో 800 ఐటీఐలను అభివృద్ధి చేస్తారు. పరిశ్రమల భాగస్వామ్యం ప్రైవేట్ మరియు కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యంతో పారిశ్రా మిక అవసరాలకు తగ్గట్టుగా కొత్త కోర్సులను రూపొందించి విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ,ప్లేస్‌మెంట్స్ అందిస్తారు. దేశంలోనే తొలిసారిగా ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ఆధునికీకరణకు ఆమోదం లభించింది. ఇక్కడ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ భాగస్వామ్యంతో రూ.200 కోట్లతో నాలుగు ప్రభుత్వ ఐటీఐలను అభివృద్ధి చేస్తున్నారు .మొత్తం మీద ఏపీలో 83 ఐటీఐలను ఆధునిక క్లస్టర్లుగా తీర్చిదిద్దనున్నారు. ఈ వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, ఐఅండ్‌ఐ శాఖ కార్యదర్శి మరియు పియం ప్రగతి రాష్ట్ర నోడల్ అధికారి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జి.గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో గస్తీ పటిష్టం చేయాలి

ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): అటవీ ప్రాంతాల్లో నిఘా, గస్తీ మరింత పటిష్ఠం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యా వరణ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. బ్రేక్ వైర్ల దుర్వినియోగంపై మెకానిక్‌లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అటవీ సంపదను, వన్యప్రాణులను పరిరక్షించడంలో నిరంతరం అప్రమ త్తతతో విధులు నిర్వర్తిస్తున్న అటవీ శాఖ సిబ్బందిని అభినందిం చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడు మిల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో అక్రమ వేటను అరికట్టేందుకు అటవీ సిబ్బంది చేపట్టిన ప్రత్యేక పెట్రోలింగ్‌లో 69 వేట ఉచ్చులను గుర్తించి తొలగిం చారు. వన్య ప్రాణులకు పొంచి ఉన్న ముప్పును నివారించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, యానిమల్ ట్రాకర్లు, బేస్ క్యాంప్ సిబ్బందిని డిప్యూటీ సీఎం ప్రశంసించారు. అడవుల్లో నిరంతర గస్తీ, క్షేత్రస్థాయి సిబ్బం ది అప్రమత్తత, సమష్టి కృషి వల్ల అనేక వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు తప్పిందని పేర్కొన్నారు. అక్రమ వేట నిరోధానికి తీసు కోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. బ్రేక్ వైర్లతో ఉచ్చుల తయారీని నియంత్రించే చర్యల్లో భాగంగా ఆటోమొబైల్ షాపుల యజమానులు, మోటార్ మెకానిక్‌లకు అవగాహన కల్పిం చాలని ఆదేశించారు. అడవుల్లో అమర్చే ప్రతి ఉచ్చు ఒక వన్యప్రాణి ప్రాణానికి ముప్పుగా మారుతుందని తెలిపారు. వాటి ని గుర్తించి తొలగించడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు కీలకమైన సేవ చేసినట్లు అవుతుందని స్పష్టం చేశారు.

రాజ్యాంగమే ప్రజాస్వామ్య జీవనాడి!

భారత ప్రజాస్వామ్య చరిత్రలో నవంబరు 26 ఒక సువర్ణాధ్యాయం. దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తూ ప్రతి పౌరుడి హక్కులకు రక్షణ కవచంగా, ప్రజాస్వామ్య వ్యవస్థకు దిక్సూచిగా నిలిచిన భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26న ఆమోదించింది. 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన ఈ మహోన్నత రాజ్యాంగం భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం గా నిలిపింది. రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సహా ఎందరో మహనీయుల కృషి, దార్శనికత, దూరదృష్టి ఇమిడి ఉన్నాయి.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భార తదేశానికి రాజ్యాంగం ఒక దిక్సూచి. కోట్లాది ప్రజల ఆకాంక్షలకు, ఆశలకు, హక్కులకు, స్వేచ్ఛకు అది రక్షణ కవచం. కులం, మతం, ప్రాంతం, భాష, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన మహోన్నత ప్రజాస్వామ్య పత్రం భారత రాజ్యాంగం. అటువంటి రాజ్యాంగాన్ని గౌరవించ డం, దాని విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత మాత్రమే కాదు. అధికారంలో ఉన్న పాలకుల ప్రథమ కర్తవ్యం కూడా. రాజ్యాంగ నిర్మాతలను స్మరించు కొంటూ ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదువుకోవడం మంచి సంప్రదాయం. భారత రాజ్యాంగం మనకు అందించిన గొప్ప సందేశం ఒక్కటే. ఈ దేశానికి ప్రజలే సార్వ భౌములు. రాజ్యాంగాన్ని పుస్తకాల్లో భద్ర పరచడం కన్నా ప్రజల జీవితాల్లో ప్రతిబింబింప జేయడం ముఖ్యం. ప్రజల గొంతుకకు విలువ ఉన్నప్పుడు, సామాన్యుడికి న్యాయం అందినప్పుడు, అధికారానికి జవాబుదారీతనం ఉన్నప్పుడు, హక్కులకు భద్రత కల్పించినప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం వికసిస్తుంది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ప్రతి పౌరుడి గౌరవప్రదమైన జీవితానికి భరోసానిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమాను లేనని 14వ అధికరణ స్పష్టం చేస్తే, భావప్రకటనా స్వేచ్ఛతో పాటు పలు స్వేచ్ఛలకు 19వ అధికరణ రక్షణ కల్పిస్తోంది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు 21వ అధికరణ భరోసానిస్తోంది. ఈ హక్కులు ప్రభుత్వాలు ప్రసాదించే దయాదాక్షిణ్యా లు కావు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హామీలు. వాటిని గౌరవించడం ప్రతి ప్రభుత్వ విధి. సామాన్యుడికి న్యాయం అందుబాటులో ఉండాలి. పేదవాడికి,బలహీనవర్గాలకు, మహిళలకు, అణగారిన వర్గాలకు రాజ్యాంగ రక్షణ అందాలి. అధికార బలం, ఆర్థిక పలుకుబడి, రాజకీయ పరిచయాలు ఉన్నవారికే న్యాయం వేగంగా అందుతుంటే సమానత్వ సూత్రానికి అర్థం ఏముంటుంది? పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ కార్యాలయం వరకు, గ్రామ సచివాలయం నుంచి అత్యున్నత పరిపాలనా విభాగం వరకు పౌరుడి గౌరవానికి ప్రాధాన్యత దక్కాలి.

రాజ్యాంగం కల్పించిన అధికారాలు వ్యక్తిగత ఆస్తులు కావు!

ప్రజాస్వామ్యంలో అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో. అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ పరిమితులను గౌరవించడం అంతకంటే ప్రధానం. కానీ కొందరు పాలకులు అధికారాన్ని ప్రజాసేవకు సాధనంగా కాకుండా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకునే ఆయుధంగా భావిస్తున్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలు తమకు అనుకూలంగా వ్యవహరించాలనే ధోరణి ప్రదర్శిస్తున్నారు. తమకు అనుకూలమైనప్పుడు వ్యవస్థల నిర్ణయాలను స్వాగతించడం, ప్రతికూలంగా ఉన్నప్పుడు వాటి విశ్వసనీయతను ప్రశ్నించడం ప్రజా స్వామ్యానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. చట్ట సభలు, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, ఇతర రాజ్యాంగ సంస్థలు ఎవరి వ్యక్తిగత ఆదేశాలకు లోబడి పనిచేసేవి కావు. అవి రాజ్యాంగానికి, చట్టానికి మాత్రమే కట్టుబడి ఉండాలి. వాటి స్వతంత్రతను గౌరవించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాల్లోకి లాగడం ప్రజాస్వామ్య పునాదులనే బల హీనపరుస్తుంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు వస్తుంటా రు పోతుంటారు. ప్రభుత్వాలు మారుతుంటాయి. కానీ రాజ్యాంగ వ్యవస్థలు శాశ్వతంగా కొనసాగుతాయి. కొందరు అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలన్నీ తన కనుసన్నల్లో పనిచేయాలనుకోవడం నిరంకుశ ధోరణి కి నిదర్శనం. రాజ్యాంగం కల్పించిన అధికారాలు వ్యక్తిగత ఆస్తులు కావు. అవి ప్రజలు అప్పగించిన బాధ్యతలు మాత్రమే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులపై కక్ష సాధించడం, విమర్శించే గొంతు లను అణచివేయడం, రాజ్యాంగబద్ధ సంస్థలపై రాజకీయ యుద్ధం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. రాజ్యాంగం తనను తాను కాపాడుకోలేదు. దానిని కాపాడాల్సిన బాధ్యత పాలకులకు, ప్రజా ప్రతినిధులకు, న్యాయవ్యవస్థకు, రాజ్యాంగ సంస్థలకు, పౌర సమాజానికి, ప్రతి భారతీయుడికి ఉంది. రాజ్యాంగంలోని అక్షరాలను చదవడం మాత్రమే కాకుండా దాని ఆత్మను అర్థం చేసుకోవాలి. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సభలు నిర్వహించడం, అంబే డ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేయడం, ఆయన గొప్పతనాన్ని కొనియాడటం మాత్రమే నివాళి కాదు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన,ఘనమైన నివాళి. అధికారంలో ఉన్నవారు రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాలి. ప్రతి పక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. ప్రజాప్రతి నిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. రాజ్యాంగ వ్యవస్థలు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా స్వతంత్రంగా పనిచేయాలి. అట్లాగే రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులను కల్పించింది. ప్రాథమిక విధులను కూడా గుర్తుచేసింది. హక్కులను అనుభవిస్తూ బాధ్యతలను విస్మరించడం సరైన ప్రజాస్వామ్యం కాదు. భావప్రక టన స్వేచ్ఛనతో ఇతరులపై విద్వేషం చిమ్మకూడదు. రాజకీయ భిన్నాభిప్రాయాలను వ్యక్తిగత కక్షలుగా మార్చకూడదు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

అధికారాల కంటే బాధ్యతలు గొప్పవి!

ఎన్నో భిన్నత్వాలు, విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు కలిగిన భారతదేశాన్ని ఒకే ప్రజా స్వామ్య వ్యవస్థ కింద సమైక్యంగా నిలబెట్టిన శక్తి రాజ్యాంగానిదే. ఎన్నో సంక్షోభాలు, రాజకీయ పరిణా మాలు, అధికార మార్పులు వచ్చినా భారత ప్రజా స్వామ్యం నిలదొక్కుకుంటున్నదంటే అందుకు రాజ్యాం గం కల్పించిన రక్షణే ప్రధాన కారణం. రాజ్యాంగం పాలకులకు అధికారం ఇచ్చింది.. అదే సమయంలో ఆ అధికారానికి జవాబు దారీతనాన్ని నిర్దేశించింది. ప్రజలకు హక్కులు ఇచ్చింది..ఓటు హక్కు ద్వారా ప్రతి పౌరుడికి రాజకీయ సమానత్వం లభించినా, సమాజం లో కొందరికి అపారమైన అవకాశాలు, మరికొందరికి కనీస అవకాశాలు కూడా లేని పరిస్థితి. అందుకే విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత కు రాజ్యాంగం ప్రాధాన్య మిచ్చింది. బడుగు,బలహీన వర్గాలు అభివృద్ధి ఫలాలను అందుకోవాలని, మహిళ లకు సమాన అవకాశాలు లభించాలని, యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పేదరి కం, నిరక్ష రాస్యత, వివక్ష నిర్మూలనకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి అవసరమైన అడుగులు. అదే సమయంలో బాధ్యతలను గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రభుత్వాలకు పాలనా స్వేచ్ఛను ఇచ్చింది. అదే సమయంలో ప్రజల హక్కులను హరించకుండా నియంత్రణలు విధించింది. ఈ సమతుల్యతే భారత ప్రజాస్వామ్యానికి అసలైన బలం. నవంబరు 26న జరుపుకునే రాజ్యాంగ దినోత్సవం కేవలం ఒక చారిత్రక సందర్భం కాదు. మన ప్రజా స్వామ్య ప్రయాణాన్ని సమీక్షించుకునే సందర్భం. రాజ్యాంగాన్ని రూపొందిం చిన మహనీయుల త్యాగాలను స్మరించుకునే సందర్భం. పాలకులు తమ అధికార పరిధిని, బాధ్యతలను గుర్తుచేసుకునే సందర్భం. ప్రజలు తమ హక్కుల విలువను తెలుసు కునే సందర్భం. రాజ్యాంగం కంటే పాలకులు గొప్ప వారు కాదు. పాలకుల కంటే ప్రజాస్వామ్యం గొప్పది. వ్యక్తుల కంటే వ్యవస్థలు గొప్పవి. అధికారాల కంటే బాధ్యతలు గొప్పవి. ఈ సత్యాన్ని ప్రతి పాలకుడు గుర్తించినప్పుడే అంబేద్కర్ ఆశయాలకు సార్థకత చేకూరుతుంది. రాజ్యాంగ విలువలను రాజకీయాలకు అతీతంగా గౌరవించి, వాటిని ఆచరణలో నిలబెట్టిన ప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.అదే రాజ్యాంగ నిర్మాతకు మనమిచ్చే ఘనమైన నివాళి. అదే సమానత్వ, న్యాయబద్ధ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి బలమైన పునాది కాగలదు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగినప్పుడే రాజ్యాంగ స్ఫూర్తి పరిఢవిల్లుతుంది.

- నీరుకొండ ప్రసాద్

జోన్ - 1
(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)
చైతన్యరథం

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలో గురువారం జరగనున్న తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 8 మండలాల్లో 215 గ్రామపంచాయతీలు, 2,146 వార్డు మెంబర్లకు పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. తొలి విడతలో భాగంగా 8 మండలాల్లో 31 పంచాయతీలు, 458 వార్డు మెంబర్లు ఏకగ్రీవం అయినట్లు చెప్పారు. మిగిలిన గ్రామ పంచాయతీలకు నిర్వహించనున్న ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బంది చేరుకున్నారు. ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం



విజయనగరం రూరల్: జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎస్. రాంసుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని బొబ్బిలి, విజయనగరం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 8 మండలాలు బొబ్బిలి-30, బాడంగి-25, తెర్లాం-33, రామభద్రపురం-22, కొత్తవలస-25, లక్కవరపుకోట-31, వెపాడ-26, శృంగవరపుకోట-29 మొత్తం 221 గ్రామ పంచాయతీలకు, మొత్తం 2,108 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ప్రకటించారు. 2,148 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఎన్నికల సిబ్బంది విధుల కేటాయింపు, డిస్ట్రిబ్యూషన్, ఎన్నికల సామగ్రి పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ అధికారులతో సమీక్షిస్తూ తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్కు అవసరమైన ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), ఇతర పోలింగ్ సిబ్బంది సకాలంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పోలీసు సిబ్బంది, కౌంటింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అన్ని ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ప్రసాద్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే కూటమి ప్రజాబలం



రాజాం (చైతన్యరథం): రాజాం మండలం శ్యాంపురం తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు, జిల్లా పరిశీలకులు చింతకాయల విజయకుమార్ బుధవారం రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ ఎన్నికలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వార్డుల వారీగా ఎన్నికల ప్రచారం, ప్రజల స్పందన, అభ్యర్థుల పనితీరు, ఎన్నికల పరిస్థితులపై వివరాలు తెలుసుకుని కీలక సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. పట్టణంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే కూటమికి ప్రజాబలమని, వాటిని గుర్తించి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రాజాం పట్టణంలో రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పట్టణ ప్రగతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాజాం మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మరియు మహిళలకు సమానావకాశాలు, రక్షణ, ఆర్థిక స్వేచ్ఛ, సాధికారత కల్పించడం పార్టీ సిద్ధాంతం

మన ఓటు.. మన శ్రీకాకుళం భవిష్యత్తు.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి!

- **శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట**
- **డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం**
- **ఓటర్లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి**



కోటబొమ్మాళి (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. రేపు (గురువారం) జరగనున్న శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లంతా పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పే కీలకమని, ప్రతి ఓటు స్థానిక ప్రాంత భవిష్యత్తును నిర్ణయించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మౌలిక వసతుల కల్పన, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్థానిక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి కోరారు. శ్రీకాకుళం నగర అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందిన గ్రామాలు, పట్టణాలే స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి బలమైన పునాదులని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను ప్రజలు తమ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎన్నుకోవాలని మంత్రి కోరారు.

బంగాళాఖాతంలో ద్రోణి, పిడుగులతో భారీ వర్షాలు



అమరావతి (చైతన్యరథం): ఏపీలో మరోసారి తుఫాను ముప్పు పొంచి ఉంది. ఈ నెలాఖరుతో పాటుగా డిసెంబర్ రెండో వారంలో వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రం పైన ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో బుధవారం నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించింది. ఉరుములు, ఈదురుగాలుల సమయంలో చెట్లు, భారీ హోర్డింగుల వద్ద నిలబడ వద్దని ప్రజలకు ఆర్టీజీఎస్ సూచించింది. వర్షాల కారణంగా ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే.. అత్యవసర నంబర్ల కు కాల్ చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాతావరణం మారింది. ప్రకాశం జిల్లా ఒంగోలులో భారీ వర్షంతో రోడ్లపై మోకాలి లోతున నీరు నిలిచింది. నెల్లూరు లోనూ వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. వాతావరణ శాఖ తాజా అలర్ట్స్ కాగా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగిలిన జిల్లాల్లోనూ చెదురుమదురు జల్లులు పడవచ్చని పేర్కొంది. రేపు కూడా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశం ఉండటంతో రెవెన్యూ, విపత్తుల నిర్వహణ విభాగాలు పరిస్థితిని సమీక్షించనున్నాయి. పిడుగుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక యంత్రాంగం ఇచ్చే హెచ్చరికలను పాటించాలని అధికారులు కోరారు. కాగా, ఈ నెలాఖరు నుంచి డిసెంబర్ రెండో వారం వరకు రెండు తుఫాన్లు రాష్ట్రం పైన ప్రభావం చూపుతాయనే అంచనాలతో యంత్రాంగం అప్రమత్తం అవుతోంది.

ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలి: కార్పొరేటర్లకు గంటా దిశానిర్దేశం



భీమిలి (చైతన్యరథం): ప్రతీరోజు ఉదయం కొంతసేపు వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దిశానిర్దేశం చేశారు. భీమిలి, మధురవాడ జోన్‌ల నుంచి కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీ, పరిషత్ ఎన్నికల కారణంగా గడిచిన 2 – 3 నెలలుగా అభివృద్ధి పనులపై దృష్టి కేంద్రీకరించ లేకపోయామన్నారు. ప్రజల అంచనాలు చేరుకునేలా కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు పని చేయాలని సూచించారు. వార్డుల్లో తాగు నీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయాలన్నారు. నిత్యం క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండే నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడతారని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వార్డుల్లో సమస్యలకు పరిష్కార మార్గం చూపించాలన్నారు. రెండు జోన్లలో జరుగుతున్న పనుల్లో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. సకాలంలో పూర్తి చేయడంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు చెప్పారు. కొత్తగా మంజూరు చేయాల్సిన అభివృద్ధి పనుల కోసం జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడుతానన్నారు. ఎండాడ రైతుబజార్, చిల్లపేట చెరువు సుందరీకరణ వంటి అంశాలను ప్రధాన అజెండాగా పెట్టుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఎస్.ఈ. శాంతిరాజు, భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, శాఖారి శ్రీనివాస్, గరే సదానంద, నాగోతి రూపకుమారి, గరే జ్యోతి, పిల్లా రేవతి, పాసి సుస్మిత, ఇప్పాక వరలక్ష్మి, కూటమి నాయకులు మాన్యాల సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

అసెంబ్లీకి రావడంలో జగన్ డక్ అవుట్.. బెంగళూరు-తాడేపల్లి ప్రయాణాల్లో మాత్రం సెంచరీలు



అమరావతి (చైతన్యరథం): బెంగళూరు–తాడేపల్లి రౌండ్ ట్రిప్పుల్లో సెంచరీ పూర్తి చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలంటూ రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బెంగళూరు నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు తిరగడంలో జగన్ సెంచరీలు కొడుతున్నారని, కానీ అసెంబ్లీకి రావడంలో మాత్రం కెప్టెన్‌గా డక్ అవుట్ అయ్యారని ఎద్దేవా చేశారు. రెండున్నరేళ్లలో అసెంబ్లీ హాజరు సున్నా అని విమర్శించారు. బెంగళూరు–తాడేపల్లి రౌండ్ ట్రిప్పుల్లో డబుల్, ట్రిపుల్ సెంచరీలు చేసేలా ఉన్న జగన్.. ఈసారైనా అసెంబ్లీకి వస్తారా? లేదా? అని ప్రశ్నించారు. జగన్ అండ్ టీమ్ క్రికెట్ జట్టుకు సరిపడా కేవలం 11 మంది ఉన్నారని కానీ కెప్టన్ జగన్ అసెంబ్లీ పిచ్ కు హాజరవ్వకుండా బెంగుళూరు ఏపీ రౌండ్ ట్రిప్‌లలో సెంచరీ చేశారని ఎంపీ సానా సతీష్ బాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

పెదపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అంకెం ఇందిరా ప్రియదర్శిని



దెందులూరు (చైతన్యరథం): నియోజకవర్గం పెదపాడు మండలం పెదపాడు గ్రామంలో నిర్వహించిన స్థానిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తూ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కూటమి శ్రేణులతో మమేకమై ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు కూటమి అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ... కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ బి. రాజకుమారి



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ, మలి దశ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న వేళ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని ఐజీ (రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్) బి. రాజకుమారి తెలిపారు. బుధవారం విజయవాడలో ఐజీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఐజీ రాజకుమారి వివరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 607 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని.. 213 మంది అరెస్ట్ చేశామని.. 1,785 మందికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126/129 కింద 25,207 బైండోవర్ కేసులు నమోదు చేయడంతోపాటు 1,41,687 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 37,942 ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులు నమోదు చేశామని అన్నారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా 9,337 ఆయుధాలు డిపాజిట్ చేశామని ఐజీ రాజకుమారి తెలిపారు. అలాగే 3,548.4 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు ఐజీ బి. రాజకుమారి స్పష్టం చేశారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడినట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఐజీ రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

ఏపీ సర్పంచ్ అభ్యర్థి తెలంగాణలో ఎన్నికల ప్రచారం

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికల సందడి కనిపిస్తోంది. మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలకు గ్రామాలు సిద్ధమవుతున్నాయి. మొదటి విడతలో భాగంగా నవంబర్ 26న, రెండో విడతలో భాగంగా నవంబర్ 29న, మూడో విడతలో డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించనున్నారు. మూడు విడతలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగియగా.. తొలి విడతకు సంబంధించి ప్రచారపర్వం పూర్తయ్యింది.. గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో పల్లెల్లో ఎక్కడ చూసినా సర్పంచ్ ఎన్నికల హీట్ కనిపిస్తోంది. ఇక రెండో విడత, మూడో విడత ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారంలో బిజీ అయ్యారు.ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. కానీ విచిత్రంగా సర్పంచ్‌గా పోటీచేస్తున్న అభ్యర్థి సొంత ఊరిలో కాకుండా ఏకంగా హైదరాబాద్ వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

ఏపీ పంచాయతీ ఎన్నికల్లో భారీ మార్పులు.. ఇంక్ గుర్తు చిటికెన వేలిపైన

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు ఎడమ చేతి చిటికెన వేలుపై చెరగని సిరా గుర్తు వేయాలని పోలింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నవంబర్ 13వ తేదీన ఉత్తర్వుల నంబర్ 1818/SEC-B2/2026ను విడుదల చేసినట్లు తెలిపారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన రోజు నుంచే ఈ సిరా గుర్తు మార్పు నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చినట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సాధారణంగా ప్రతి ఎన్నికల సమయంలోనూ ఓటర్ల ఎడమ చేతి చూపుడు వేలుపై సిరా చుక్క వేయడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. అయితే, ఇటీవల ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల ఎడమ చేతి చూపుడు వేలుపై సిరా గుర్తు వేశారు. దీనికి తోడు కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రీ–పోలింగ్ నిర్వహించాల్సి రావడంతో, ఆయా ప్రాంతాల్లోని ఓటర్ల ఎడమ చేతి మధ్య వేలుపై కూడా సిరా గుర్తు వేశారు.





గందరగోళం నివారణకే ఈ ప్రత్యేక నిర్ణయం:

తక్కువ వ్యవధిలోనే వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతుండటంతో, గత ఎన్నికల సమయంలో వేసిన సిరా గుర్తులు ఓటర్ల వేళ్లపై ఇంకా చెరిగిపోకుండా అలాగే ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ పాత సిరా గుర్తుల వల్ల పోలింగ్ సిబ్బందికి తికమక ఏర్పడకుండా, అలాగే దొంగ ఓట్లకు ఎలాంటి అవకాశం లేకుండా అడ్డుకట్ట వేసేందుకే ఎస్ఈసీ ఈ మార్పు చేశారు. ఈ కొత్త విధానంపై పోలింగ్ కేంద్రాల సిబ్బందికి తగిన శిక్షణ, సూచనలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.

ఏపీ ఎన్నికలపై SEC కీలక ఆదేశాలు.. ఖర్చుల లెక్కలు చూపకపోతే మూడేళ్ల అనర్హత!

అమరావతి (చైతన్యరథం): ఏపీలో పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నేడు ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ జరగనుంది. 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ఎలక్షన్ కమిషన్.. ఎన్నికల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసింది. 46వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు డీజీపీ ప్రకటించారు. అటు.. ZPTC, MPTC ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు డిసెంబర్ 21లోగా ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలని SEC ఆదేశించింది. ఏపీలో గురువారం తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో 3వేల 191 సర్పంచ్ స్థానాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రేపు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. 3 వేల 949 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. 758 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మరోవైపు.. 23 మున్సిపాలిటీల్లో మలివిడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే.. గ్రామ పంచాయతీ, 23 మున్సిపాలిటీల ఎన్నికలపై రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ దృష్టి సారించింది. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించింది. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్, గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజుజ అనిల్ చంద్ర పునేఠా కీలక సూచనలు చేశారు. ఈ నెల 30న జరగనున్న మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు గతంలో కంటే రెండు, మూడు రెట్లు అధికంగా టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల్లోపు కౌంటింగ్ పూర్తి చేసి ఫలితాలు ప్రకటించాలని చెప్పారు. ఇక.. గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో గరిష్టంగా 650 మంది ఓటర్లకు మించకుండా చూడాలన్నారు. ఎన్నికల సీసీటీవీ ఫుటేజ్‌ను కనీసం 60 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో మొబైల్ పోలీసు బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు SEC అనిల్ చంద్ర పునేఠా.

46,080మందితో భారీ పోలీసు బందోబస్తు

ఎన్నికల భద్రతపై ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పూర్తిస్థాయి ప్రణాళికను ప్రకటించారు. తొలి విడత పంచాయతీ, మలివిడత మున్సిపల్ ఎన్నికలకు పోలీసులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. 26 జిల్లాల్లోని 201 మండలాల్లో జరగనున్న ఎన్నికల కోసం 46,080 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు చెప్పారు. సీటీవీలు, డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో ఎన్నికలను పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర పటిష్ట భద్రతతో పాటు.. అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీజీపీ హెచ్చరించారు. తొలి విడత పంచాయితీ ఎన్నికల్లో భాగంగా.. అనుమానిత వ్యక్తులపై ఇప్పటికే ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.

45 రోజుల్లోగా వ్యయ వివరాల సమర్పణకు ఆదేశాలు

మరోవైపు.. ZPTC, MPT ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 45 రోజుల్లోగా తమ ఎన్నికల వ్యయాన్ని సమర్పించాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. గెలిచిన అభ్యర్థులైనా ఓడిన అభ్యర్థులైనా ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలక్షన్ ఖర్చును సమర్పించాలని SEC అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. ఎన్నికల ఖర్చుల వివరాలను వచ్చే నెల 21లోగా స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. లెక్కలు చూపకపోతే పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 19–B ప్రకారం మూడేళ్లపాటు అనర్హత వేటు పడుతుందని చెప్పారు. అలాగే.. లెక్కలు సబ్మిట్ చేయకుంటే గెలిచినవారు కూడా పదవి కోల్పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి అభ్యర్థులకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్లకు రాజుజ అనిల్ చంద్ర పునేఠా ఆదేశాలు ఇచ్చారు. మొత్తంగా.. ఏపీ రేపు జరగనున్న తొలి విడత పంచాయతీ, మలివిడత మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. అటు.. ZPTC, MPTC అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాల సమర్పణపైనా ఎస్ఈసీ కీలక ఆదేశాలు ఇచ్చింది.

కనుమూరు ఫారెస్టులోనే పెద్దపులి... ఐదో రోజుకు చేరిన టైగర్ ఆపరేషన్

తిరువూరు (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లాలో పెద్దపులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారుల గాలింపు చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గంపలగూడెం మండలం కనుమూరు ఫారెస్టో గత ఐదురోజులుగా పెద్ద పులి తిష్ట వేసింది. పులికి అవసరమైన ఆహారం, నీరు సమృద్ధిగా లభించడంతో పాటు అనువైన అటవీ వాతావరణం ఉండటంతో కనుమూరు ఫారెస్టోనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గత రెండు రోజులుగా ట్రాకర్ ద్వారా పులి కదలికలకు సంబంధించిన సంకేతాలు స్పష్టంగా అందడం లేదని అధికారులు పేర్కొన్నారు. ట్రాకర్ సంకేతాలు స్పష్టంగా అందకపోయినా వెనక్కి తగ్గకుండా అటవీ ప్రాంతానికి అన్ని వైపులా అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. పులి సంచారం ఉన్న సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ఒంటరిగా అటవీ ప్రాంతాలు, పొలాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరికలు జారీ చేశారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజల బ్రహ్మరథం

● కృష్ణా జిల్లా కూటమి నాయకత్వం... పార్టీ అధ్యక్షుడు వీరంకి హర్షం వ్యక్తం



మచిలీపట్నం (చైతన్యరథం): ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కృష్ణా జిల్లా ప్రజలు కూటమి అభ్యర్థులకు అందించిన ఆదరణ, మద్దతు పట్ల కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా ప్రజలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో మొత్తం 26 జెడ్పీటీసీ స్థానాలకు గాను 25 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడంతో పాటు, ఎంపీటీసీ స్థానాల్లోనూ సుమారు 90 శాతం స్థానాల్లో విజయం సాధించిందని తెలిపారు. అదేవిధంగా రెండు మున్సిపాలిటీల్లోనూ చైర్మన్ పదవులను కూటమి దక్కించుకుందని, మచిలీపట్నం నగరపాలక సంస్థలోనూ కూటమికి ప్రజలు విశేష మద్దతు అందించారని పేర్కొన్నారు. కార్పొరేటర్ స్థానాల్లోనూ సుమారు 90 శాతం స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, భావితరాల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రాబోయే నవంబర్ 26, 29 మరియు డిసెంబర్ 2 తేదీల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు గుడివాడ, తాడిగడప మున్సిపాలిటీల ఎన్నికల్లోనూ ప్రజల ఆశీస్సులు, ఆదరణ కూటమికి లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కృష్ణా జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జనసేన పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన ఆదరణ ఎంతో సంతోషాన్నిచ్చిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

బీజేపీ నాయకులు పంతం గజేంద్ర మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంపై, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తమ విశ్వాసాన్ని ఎన్నికల ఫలితాల ద్వారా తెలియజేశారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ సమన్వయంతో ముందుకు సాగుతాయని తెలిపారు.

టీడీపీ నాయకులు బచ్చుల బోస్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అందించిన మద్దతు అభినందనీయమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించేందుకు కూటమి నాయకులు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు.

కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి లభించిన ప్రజాదరణ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు అందించిన మద్దతు మరువలేనిదని, రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు గుడివాడ, తాడిగడప మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు.

అంతర్జాతీయ వేదికపై గుంటూరు నగర మేయర్ లక్ష్మీ అపర్ణ

●ప్రపంచ మేయర్ల సదస్సులో గుంటూరు నగరానికి ప్రాతినిధ్యం



గుంటూరు (చైతన్యరథం): ముంబైలోని హోటల్ ఫెయిర్‌మాంట్‌లో నవంబర్ 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ మేయర్ల సదస్సు (3rd World Mayorsμ Forum), 7వ ఆసియా నగరాల సదస్సు (7thAsian Cities Summit 2026) కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో వివిధ నగరాల మేయర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణాభివృద్ధి రంగ నిపుణులు పాల్గొన్నారు. పట్టణ పాలన, ఆధునిక మౌలిక సదుపాయాలు, సుస్థిర నగరాభివృద్ధి, ప్రజలకు మెరుగైన పౌరసేవలు వంటి కీలక అంశాలపై చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలిచింది. గుంటూరు నగర మేయర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం అంతర్జాతీయ స్థాయి సదస్సులో పాల్గొనడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఏకగ్రీవ పంచాయతీ సర్పంచ్‌లతో ఎమ్మెల్యే వేగేశన



బాపట్ల (చైతన్యరథం): కర్లపాలెం మండలం, పెదపులుగువారిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పులుగు వెంకటేశ్వర్లు రెడ్డి (పాలవెంకన్న) సతీమణి పులుగు వెంకట సుబ్బమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు అధికారికంగా ప్రకటించారు. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఎమ్మెల్యే ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేస్తూ, నూతన సర్పంచ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం జడ్పీటీసీ నక్కల వెంకటస్వామి, పరిశా గోపిరెడ్డి పెదపులుగువారిపాలెం గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం, నాగరాజుపాలెం గ్రామ సర్పంచ్‌గా శ్రీషేక్ మీరావలి (బుజ్జి) భార్య షేక్ వహిదాబిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు అధికారికంగా ప్రకటించారు. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఎమ్మెల్యే ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేస్తూ, నూతన సర్పంచ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ప్రేమోన్మాది దాడిలో గాయపడి... కోలుకుంటున్న రాప్తాడు బాలిక

● మణిపాల్ ఆసుపత్రిలో రాప్తాడు బాలికతో కేక్ కట్ చేయించిన వైద్యులు...

అమరావతి (చైతన్యరథం): గత నెలలో స్కూల్‌లోకి చొరబడిన ప్రేమోన్మాది.. ఎలక్ట్రిక్ రంపంతో పదో తరగతి బాలికపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన తెలుగు రాష్ట్రాలను వణికించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి.. చావుబతుకుల్లో కొట్టుమిట్టాడిన బాలికకు వైద్యులు సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆమె బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో కోలుకుంటోంది. దీంతో అక్కడి వైద్యులు ఆమెతో కేక్ కటింగ్ చేయించారు. ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి.. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనంతపురం జిల్లా రాప్తాడుకు చెందిన బాలిక క్రమంగా కోలుకుంటోంది. ఆమె ఆరోగ్యం మెరుగుపడిందని, ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం హాస్పిటల్‌లో బాధితురాలిలో ఉత్సాహాన్ని నింపడానికి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ఆమెతో కేక్ కట్ చేయించారు. అంతేకాదు, మ్యూజికల్ సెషన్ కూడా నిర్వహించారు. ఆమెలో మనో ధైర్యం నింపి, మరింత దృఢంగా తయారు కావాలనే ఉద్దేశంతోనే వైద్యులు ఈ ఏర్పాట్లు చేశారు. ఓ వేడుక జరుపుకున్నట్టు ఆమె ఉండే గదిని బెలూన్లతో అందంగా అలకరించారు.

బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి

పదో తరగతి చదువుతోన్న బాలికపై అక్టోబరు 31న ప్రేమోన్మాది ఎలక్ట్రిక్ రంపంతో అత్యంత క్రూరంగా దాడిచేసి, గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను అనంతరంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్స్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించారు. దీంతో బాలికకు ప్రాణాపాయం తప్పి నెమ్మదిగా ఆరోగ్యం మెరుగుపడింది. బాధిత బాలిక విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఆమె వైద్యం కోసం అయ్యే ఖర్చును భరించడమే కాదు.. నిరంతరం హాస్పిటల్ యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతూ ఆమెకు మెరుగైన చికిత్స నఅందేందుకు కృషి చేసింది. కాగా, రాప్తాడు బాలిక ఆరోగ్యం గురించి రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. బాలికతో కేక్ కట్ చేయించిన విషయాన్ని కూడా ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో షేర్ చేశారు.

మంత్రి నారా లోకేష్ అభినందనలు

"చిన్న చిన్న ప్రయత్నాలే ఎంతో గొప్ప మార్పును తీసుకొస్తాయి.. ఆ చిన్నారిలో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపడానికి గదిలోనే కేక్ కటింగ్, మ్యూజిక్ సెషన్ నిర్వహించిన ఆసుపత్రి బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. ఆ చిన్నారి మరింత మనో ధైర్యాన్ని నింపుకుని, త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను!" అని ఆయన ట్వీట్ చేశారు. మరోవైపు, బాలికపై దాడిచేసిన నిందితుడు హేమంత్ పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడగా.. కుళ్లిపోయిన స్థితికి చేరడంతో ఓ కాలును వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. దాడి తర్వాత పరారైన అతడ్ని పట్టుకోడానికి వెళ్లగా.. పోలీసులపై కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడి కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది. నిందితుడు చికిత్స అనంతరం కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. అతడ్ని పోలీసులు న్యాయస్థానం ఎదుట హాజరుపరచడంతో 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఇక, దాడి సమయంలో బాలికను కాపాడేందుకు ఆమె స్నేహితురాలు తన ప్రాణాలకు తెగించి, నిందితుడ్ని అడ్డుకుంది. ఈ క్రమంలో ఆమెకు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి నెట్టెం



ఉండవల్లి (చైతన్యరథం): ఉండవల్లిలోని నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ని ఆప్కాబ్ చైర్మన్ గన్నీ వీరాంజనేయులతో కలిసి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు, ఎంపీటీసీ ఎన్నికల్లో మంత్రి నారా లోకేష్ సమర్థవంతమైన నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ కనబరిచిన అద్భుతమైన పనితీరు, పార్టీ శ్రేణుల కృషి, కూటమి నాయకుల మధ్య నెలకొన్న సమన్వయం, సమష్టి కార్యాచరణతో సాధించిన విజయాలపై ప్రత్యేకంగా చర్చించారు. రాబోయే సహకార సంఘాల (సొసైటీల) ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, ప్రతి సొసైటీలో పార్టీ మద్దతుదారుల విజయమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

సర్పంచ్ బరిలో మాజీ మావోయిస్టు...



అల్లూరి (చైతన్యరథం): అల్లూరి జిల్లా హుకుంపేట మండలం ములియాపుట్టు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మాజీ మావోయిస్టు చెండా భూషణం అలియాస్ నాగరాజు పోటీలో నిలిచారు. 1996 ప్రాంతంలో తాండవ దళం కమాండర్గా పనిచేసిన చడ్డా భూషణం, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది, జైలు శిక్ష అనుభవించారు. ప్రస్తుతం ఆయన ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేయడానికి సర్పంచ్ బరిలో దిగారు.

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు

చీరాల (చైతన్యరథం): పర్చూరు నియోజకవర్గంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం చీరాలలో బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మీడియా సమావేశం నిర్వహించారు. మొదటి దశ పంచాయతీ ఎన్నికలకు 1000 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల విధుల్లో సమర్థ్ మొబైల్ యాప్ కీలక ప్రాత పోషిస్తుందని, సమస్య తలెత్తిన పోలింగ్ ప్రాంతాలకు పోలీస్ బలగాలు తక్షణమే చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

కార్తీక బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్ వెల్లడి

తిరుచానూరు (చైతన్యరథం): శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన పంచమితీర్థానికి లక్షలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో బుధవారం తిరుమల నుంచి తిరుచానూరుకు శ్రీవారి పడి సారెను తీసుకువచ్చే ఊరేగింపు మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం తిరుచానూరులోని తోళప్ప గార్డెన్స్‌లో అధికారులతో సమావేశమై బ్రహ్మోత్సవాలు, పంచమితీర్థం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి తరఫున తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి సమర్పించే పడి సారె మన ప్రాచీన ధార్మిక సంప్రదాయాలకు, తిరుమల, తిరుచానూరు ఆలయాల మధ్య ఉన్న పవిత్ర అనుబంధానికి ప్రతీక అని తెలిపారు. ఈ అపురూపమైన ఆధ్యాత్మిక ఘట్టాన్ని భక్తులు కనులారా వీక్షించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.



శ్రీవారి సారె
ఊరేగింపు మార్గంలో ట్రయల్ రన్

తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో ఉన్న శ్రీ వినాయకస్వామివారి ఆలయం నుంచి శ్రీవారి పడి సారె ఊరేగింపు ట్రయల్ రన్ ప్రారంభమైంది. ఏనుగుపై సారెను తీసుకువెళుతూ కోదండరామాలయం, చిన్నబజారు వీధి, పాత హుజూర్ కార్యాలయం, గోవిందరాజస్వామివారి ఆలయం, ఆంజనేయస్వామివారి ఆలయం, బండ్ల వీధి, ఆర్టీసీ బస్టాండ్, పద్మావతిపురం, మార్కెట్ యార్డు, శిల్పారామం మీదుగా తిరుచానూరులోని పసుపు మండపానికి చేరుకున్నారు.అక్కడి నుంచి పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, గోశాల డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, డిప్యూటీ ఈవోలు హరేంద్రనాథ్, శాంతి, శివప్రసాద్, విజివో అదనపు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ సిబ్బందిని తరలింపునకు బస్సుల ఏర్పాటు

కుప్పం (చైతన్యరథం): కుప్పంలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సులు సరిపోకపోవడంతో రెండో ట్రిప్పు బస్సుల కోసం సిబ్బంది కుప్పంలోని ఎంఎఫ్సీ జూనియర్ కళాశాల మైదానంలో నేలపై కూర్చుని నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిబ్బందికి అనుగుణంగా బస్సులు సమకూర్చడంలో ఎన్నికల అధికారులు విఫలం కావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది.

పెదపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం

పాల్గొన్న అంకెం ఇందిరా ప్రియదర్శిని

దెందులూరు (చైతన్యరథం): దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం పెదపాడు గ్రామంలో నిర్వహించిన స్థానిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తూ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కూటమి శ్రేణులతో మమేకమై ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి అభిమానులు పాల్గొన్నారు.



మణికంఠేశ్వరాలయంలో జ్వాలాతోరణం

కాణిపాక (చైతన్యరథం): మరగదాంబిక సమేత మణికంఠేశ్వరాలయంలో జ్వాలా తోరణం నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ ఈవో పెంచలకిషోర్, సిబ్బంది, భక్తులు సహస్ర దీపాలను వెలిగించారు. ఆలయంలో లక్ష బిల్వార్చన కోసం ఉదయం ప్రధాన ఆలయ నుంచి ఈవో, సిబ్బంది పూజాసామగ్రి, బిల్వాలను తీసుకొచ్చి ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌కు అందించారు. అనంతరం రాత్రి ఆలయంలో పెద్ద ప్రమిదలో నేతి దీపాలను వెలిగించి ఆలయ ప్రదక్షణగా తీసుకొచ్చారు. ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలో ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ ఆధ్వర్యంలో జ్వాలా తోరణం వెలిగించారు. ఈ పూజలలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఏఈవో ధనపాల్, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.



సమన్వయ పాలనతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

కోవూరు (చైతన్యరథం): గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో కూడిన పాలన ఉన్నప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా ముందుకు సాగుతాయని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో బుధవారం కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రశాంతి రెడ్డి మాట్లాడారు. తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయడం వల్లే ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయాలు సాధించిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు కూటమికి బలమైన మద్దతు ఇచ్చారని ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను కనీసం నామినేషన్లు కూడా వేయనివ్వకుండా అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలను చించివేసి బలవంతపు ఏకగ్రీవాలకు పాల్పడ్డారని ప్రశాంతమ్మ విమర్శించారు. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించిందని తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చట్టబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి ప్రజాతీర్పును గౌరవించామని స్పష్టం చేశారు.

ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా ప్రజల మద్దతు కూటమికే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈవీఎంల ద్వారా సాధించిన విజయాలపై వైసీపీ అనేక విమర్శలు చేసిందని ప్రశాంతి రెడ్డి గారు గుర్తుచేశారు. ఇప్పుడు బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి ఘన విజయాన్ని అందించి ఆ విమర్శలకు సమాధానం చెప్పారని అన్నారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు మాత్రం కూటమికి అనుకూలంగానే ఉందని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.

సమన్వయంతోనే ప్రగతి సాధన

గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా, సమర్థవంతంగా అమలవుతాయని ప్రశాంతి రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాలు మరింత ప్రగతి సాధించాలన్నా, భావితరాలకు మెరుగైన భవిష్యత్తు అందించాలన్నా స్థానిక సంస్థల్లో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. అందుకే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో పనిచేసే నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

రానున్న పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పరస్పర అవగాహనతో, సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు కోరారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీల గుర్తులు లేకుండా జరిగే పోటీలో కూటమి పార్టీల ఉమ్మడి మద్దతుతో బరిలో నిలిచే సర్పంచ్ అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని ప్రోత్సహించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, భావితరాల భవిష్యత్తు లక్ష్యంగా కూటమి పార్టీల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసుకుంటూ, ప్రజల మద్దతుతో సమర్థులైన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు.



దేదీప్యమానంగా కార్తీక దీపోత్సవం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని శివకేశవ, వివిధ ఆలయాలు, ధార్మిక క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పౌర్ణమిరాకతో వందలాదిగా మహిళా భక్తులు తమతమ సమీప ఆల యాల్లో పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం నోములు, ఉపవాసాలు పాటిస్తూ పూజలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద దామోదర పూజలు, తులసి కోటల వద్ద దీపారాధనలు చేపట్టారు. సాయంత్రం సామూహికంగా విచ్చేసి దీపోత్సవాలు చేపట్టారు. నగరంలోని కేసీ కెనాల్ ఒడ్డునగల వినాయక ఘాట్‌తోపాటు, సమీపంలోని సత్యనారాయణ స్వా మి ఆలయంలో దీపాలు వెలిగించి దీపలక్ష్మికి స్వాగతం పలికారు. కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద జిల్లా యంత్రాంగం, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఘాట్‌కు ఇరువైపులా విద్యుతు దీపాలతో అలంకరించి, కాషాయ పతాకాలను ఏర్పాటు చేశారు. అటు మద్దూర్‌నగర్ వరకు, ఇటు కలెక్టరేట్ వరకు మైక్‌ల ద్వారా ఘాట్ వద్ద జరుగుతున్న కార్యక్రమాలను ప్రసారం చేశారు. వినాయక మందిరం నుంచి శివపార్వతుల రథోత్సవం వినాయక ఘాట్ వరకు చేరుకుంది.

వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సాయంత్రం 5 గంటలకు జ్యోతి ప్రజ్వలన, 5.30 గంటలకు శివపార్వతుల అభిషేక పూజలు చేశారు. ధ్వజారోహణ , ఆకాశజ్యోతి, జ్యోతి ప్రజ్వలనతో లక్ష దీపోత్సవాలు ప్రారం భించారు. దీపోత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఇ. పద్మావతమ్మ, జె. రాధిక, ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె. దేవకీదేవి, ఇతర ప్రతినిధులు జయలక్ష్మి, వరలక్ష్మి, స్వప్నసారధి, అనిత, హేమ, కమిటీ సలహాదారులు మల్లికార్జున రెడ్డి, మహేష్ పాల్గొన్నారు. పోలీసు అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తుంగభద్ర నది ఒడ్డునగల హరిహర క్షేత్రంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో లక్ష దీపోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో జ్వాలా తోరణాన్ని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సం దేల్ చంద్రశేఖర్ వెలిగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చల్లా నాగ రాజశర్మ, సీహెచ దుర్గాప్రసాద్, ఆనందరావు, శ్యామసుందర్‌రావు, టీవీ రవిచంద్రశర్మ, శ్రీనివాసరాజు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించి, జ్వాలా తోరణం, దీపోత్సవం, సామూహిక మంగళహారతులు నిర్వహించారు. ధార్మిక సప్తాహ కార్యక్ర మంలో టీటీడీ ధర్మప్రచార పరిషత కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అశోక్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి, ద్వారకామాయి ఆలయంలో దీపోత్సవాలు చేపట్టారు. లలితా పీఠంలో కార్తీక పౌర్ణమిని సందర్భంగా సామూహిక సత్యనా రాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. జ్వాలాతోరణం, భక్తులకు అల్పా హార ప్రసాదం పంపిణీ చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి దంపతులను భక్తులు ఘనంగా సత్కరించారు. నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలోని శివాలయంలో ఉద యం సావహిక పంచామృత కార్యక్రమాలు నిర్వహించారు. బిల్వార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి చేపట్టారు. అర్ధనారీశ్వర మూర్తులకు పూజలు, లలితా, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం జ్వాలాతోరణం చేపట్టారు. పాతనగరంలో షిరిడీ సాయిబాబా దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలతో సామూహిక దీపోత్సవాలు, సాయి రథోత్సవం కన్నుల పండువగా చేశారు. అనంతరం జ్వాలాతోరణం నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్‌జీ మహాబలేష్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని కాల్వబుగ్గ, కొమ్ముచెరువు, ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యా లవాడ, లొద్దిపల్లె, కన్నమడకల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మండల పొదు పులక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారాలు విజయభారతి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు కోటి దీపాలు వెలిగించారు.

టీడీపీలో చేరిన 10వ వార్డు వైసీపీ అభ్యర్థి

పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): రొద్దం మండలం సానిపల్లి పంచాయతీకి చెందిన 10వ వార్డు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అశ్వర్థ సానిపల్లి వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పెనుకొండలోని మంత్రి సవితమ్మ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితమ్మ వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సిరి



ఆదోని (చైతన్యరథం): ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పంచాయతీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి బుధవారం పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది, సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు భద్రత, వంటి అంశాలపై అధికారులతో మాట్లాడే ఆరా తీశారు. శాంతిభద్రతల సమస్యలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎక్కడ హింసకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అభ్యర్థులు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగం

ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపు



దేవనకొండ (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఫ్యాక్షన్ గ్రామం కప్పట్రాళ్లలోని పోలింగ్ కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. పోలింగ్ రోజు ఎలాంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 208 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ధనుంజయ ఉన్నారు.



కూటమితోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు (చైతన్యరథం): ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా.. ప్రజల మద్దతు కూటమి పార్టీలకే ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే గారు నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల జరిగిన కార్పొరేషన్, నగర పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి విజయాలు సాధించాయని, అదే స్ఫూర్తితో రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా కూటమి పార్టీలు ఐక్యంగా పనిచేస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్న ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ ఆశీర్వాదాన్ని అందించారని తెలిపారు. రెండున్నరేళ్ల కూటమి పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు తగ్గించడం వల్ల సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నిస్తే వైసీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని విమర్శించారు. అయినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీ పరంగా 40 శాతం మేర బీసీలకు రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికలను ప్రజలే నేరుగా ఎన్నుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిగ్గింగులు, దాడులు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వంలో ప్రశాంతమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోయినట్లు కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ ప్రజలు మాత్రం తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటున్నారని అన్నారు.

40 సంవత్సరాల తర్వాత పులివెందులతో పాటు, ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల, ఎర్రకోట, దైవందిన్నె, ఏనుగుబాల, పార్లపల్లి వంటి గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పనులు వేగవంతంగా ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో గ్రామాలే కీలకమని, ప్రతి గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు బలపరిచిన అభ్యర్థులను ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల నిరంతర అమలు, ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు.





కళా వైభవం... సేవా సంగమం

అంధత్వ నివారణే లక్ష్యంగా అలరించిన భక్తి, నృత్య ప్రదర్శనలు

శంకర నేత్రాలయ కోసం క్లీవ్‌ల్యాండ్ చాప్టర్ ఆధ్వర్యంలో నిధుల సేకరణ



క్లీవ్‌ల్యాండ్ (ఒహాయో): నిరుపేదలకు అంధత్వ నివారణ, ఉచిత నేత్ర చికిత్స అందించే సమున్నత లక్ష్యంతో 'శంకర నేత్రాలయ యూఎస్ఏ–క్లీవ్‌ల్యాండ్ చాప్టర్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'దృష్టి కోసం సంగీతం, నృత్యం' (Music Ê Dance for Vision) నిధుల సేకరణ కార్యక్రమం విజయవంతమైంది. ఒహాయోలోని మెడినా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ వేదికగా జరిగిన ఈ వేడుక గ్రేటర్ క్లీవ్‌ల్యాండ్ ప్రవాస భారతీయ సమాజాన్ని ఒకే తాటిపైకి తెచ్చింది.

సాయంత్రం 4 గంటలకు క్లీవ్‌ల్యాండ్ చాప్టర్ ధర్మకర్తల మండలి సభ్యురాలు కళ్యాణి వేటూరి స్వాగత ప్రసంగంతో కార్యక్రమం ప్రారంభమైంది. వ్యాఖ్యాత పల్లవి గీతా గూడిపాటి తన చక్కటి వ్యాఖ్యానంతో ఆహూతులను ఆకట్టుకున్నారు. రెండు గంటల పాటు సాగిన వేడుకలో పరమశివుని దివ్యరూపాలు, మహిమలను కీర్తిస్తూ యువ కళాకారుల సంగీత, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అంగ కళా కథక్ అకాడమీ, నర్తనం డ్యాన్స్ అకాడమీ, నృత్య గీతాంజలి, శ్రీకళా మందిర్, శ్రీమయూరి డ్యాన్స్ అకాడమీ, సప్తస్వర అకాడమీ, శ్రీ గురుకృప సంస్థలతో పాటు శ్రీలక్ష్మి ఆకెళ్ల (వీణ, గానం) విద్యార్థులు తమ ప్రతిభతో భారతీయ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పారు. క్లీవ్‌ల్యాండ్ చాప్టర్ ధర్మకర్తల మండలి సభ్యురాలు కళ్యాణి వేటూరి నాయకత్వంలో, చాప్టర్ ఉపాధ్యక్షుడు బాలాజీ జనపాటి సమన్వయంతో ఈ వేడుక జరిగింది. కార్యక్రమానికి సహకారం అందించిన కొలంబస్ చాప్టర్ ఉపాధ్యక్షుడు ఆర్‌కే రెడ్డి... క్లీవ్‌ల్యాండ్ బృందాన్ని అభినందించారు. నేత్ర సేవా కార్యక్రమాలకు కల్యాణి వేటూరి అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఆమెను ప్రతిష్ఠాత్మక 'నాట్య భారతి' పురస్కారంతో సత్కరించారు.

ఈ సందర్భంగా కొలంబస్, ఒహాయో–కొలంబస్ చాప్టర్ ఉపాధ్యక్షుడు ఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ... శంకర నేత్రాలయ యూఎస్ఏ అధ్యక్షుడు బాలారెడ్డి ఇందుర్తి ఎనిమిదేళ్ల నాయకత్వంలో సంస్థ సాధించిన ప్రగతిని వివరించారు. సంస్థ సేవా పరిధి 7 నగరాల నుంచి 30 నగరాలకు విస్తరించిందని, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్లు 2 నుంచి 5కు పెరిగాయని, మరో 3 యూనిట్లు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ వేడుక విజయవంతానికి కృషి చేసిన వాలంటీర్లు పల్లవి రఘుపతి, కృష్ణ కిశోర్ దేవరకొండ, అరుణ్ పైడిపల్లి, జోగారావు పైడిపల్లి, శ్రీనివాస్, ప్రబోధ్‌లతో పాటు శంకర నేత్రాలయ వ్యవస్థాపకులు ఎస్వీ ఆచార్య, 'పద్మభూషణ్' డాక్టర్ ఎస్ఎస్ బద్రీనాథ్ స్ఫూర్తిని, ప్రధాన బృందం బాలారెడ్డి ఇందుర్తి, శ్యామ్ అప్పలి, వంశీకృష్ణ ఎరువారం, మూర్తి రేకపల్లి, డాక్టర్ రెడ్డి ఉరిమిండి, రత్నకుమార్ కావూతూరు, నీలిమ గుడ్డమనుగు, గిరి కోటగిరి తదితరుల సేవలను నిర్వాహకులు కొనియాడారు.





ప్రవాస తెలుగు యువత ప్రతిభకు వేదికగా

'ఐడ్రీమ్ ఫిల్మ్ కాన్‌క్లేవ్'

కాలిఫోర్నియాలో ఉత్సాహభరితంగా వేడుక

తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాలపై ఔత్సాహిక రచయితలు, దర్శకులకు దిశానిర్దేశం

మిల్పిటాస్ (కాలిఫోర్నియా): అమెరికాలోని తెలుగు యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించేందుకు 'ఐడ్రీమ్' (iDream) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఐడ్రీమ్ ఫిల్మ్ కాన్‌క్లేవ్' ఉత్సాహభరితంగా సాగింది. కాలిఫోర్నియాలోని మిల్పిటాస్‌లో ఉన్న ఫాల్కన్‌ఎక్స్ (FalconX) మీటప్స్ వేదికగా జరిగిన సదస్సుకు ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బే ఏరియా నుంచి తరలివచ్చిన ఔత్సాహికులకు వక్తలను పరిచయం చేసి, స్క్రీన్‌ప్లే, సంభాషణల రచయితలతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. సినీ రంగంలోకి కొత్తగా అడుగుపెట్టాలనుకునే వారు అనుభవజ్ఞులైన నిపుణులతో పరిచయాలు పెంచుకోవడానికి, సరైన మార్గనిర్దేశం పొందడానికి, తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాలను అన్వేషించడానికి 'ఐడ్రీమ్ ఫిల్మ్ కాన్‌క్లేవ్' ఒక విలువైన వేదిక అని జయరామ్ ప్రశంసించారు. ఈ వర్క్‌షాప్‌నకు ప్రముఖ సినీ రచయిత గోపీ మోహన్, రచయిత, దర్శకుడు విక్రమ్ సిరికొండ ముఖ్య వక్తలు హాజరయ్యారు. కథా రచన, స్క్రీన్‌ప్లే, సినిమా నిర్మాణంలో మెళకువలపై ఔత్సాహికులకు విలువైన సూచనలు అందించారు. విరిజల్లు రేడియో తరపున విజయ ఆసూరి, కళ్యాణ్ కట్టమూరి కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.



భక్తి, విక్కతల సమ్మేళనం

హాంకాంగ్ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

హాంకాంగ్: విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలుగు భాష, సంస్కృతి, ఆచారాలు, కుటుంబ విలువలను భావి తరాలకు అందించాలనే సంకల్పంతో హాంకాంగ్ తెలుగు సమాఖ్య (THKTS) ఆధ్వర్యంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హాంకాంగ్‌లోని హ్యాపీ వ్యాలీ హిందూ దేవాలయంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో దంపతులు పాల్గొని స్వామివారిని పూజించారు. దశాబ్దానికి పైగా ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కార్తీక మాస పవిత్ర దినాన ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. పూల అలంకరణలు, దీప కాంతులు, వేదమంత్రోచ్చారణలు, భక్తిగీతాలతో ఆలయ ప్రాంగణం శోభిల్లింది. సాధారణంగా సమాఖ్య సభ్యుల్లో ఒకరు స్వయంగా తెలుగులో వ్రతకథను వివరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి సంబంధిత సభ్యులు ఉద్యోగరీత్యా విదేశీ పర్యటనల్లో ఉండటంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జూమ్ వేదిక ద్వారా వ్రత కథను విజయవంతంగా పూర్తి చేశారు. సాంకేతికతను వినియోగించుకుంటూ సంప్రదాయాలను కొనసాగించడం ప్రవాస తెలుగువారికి ఆదర్శంగా నిలిచింది.

కేవలం పూజలు, వ్రతాలకే పరిమితం కాకుండా ధర్మం, సత్యం, సేవ, కుటుంబ బంధాలు, సమాజ శ్రేయస్సు వంటి ఉన్నత విలువలను ఈ వ్రతం ప్రతిబింబిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. వ్రతానంతరం సభ్యులు ప్రసాదం స్వీకరించి సహపంక్తి భోజనాలు చేస్తూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. కొత్త సభ్యులతో పరిచయాలు పెంచుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. అనంతరం తీసిన గ్రూప్ ఫొటోలు వేడుకలో మరింత ఉత్సాహాన్ని నింపాయి.

ఈ సందర్భంగా ప్రముఖ వ్యాఖ్యాత, రచయిత్రి రాధిక మంగిపూడి హాంకాంగ్‌లో ఉన్న నేపథ్యంలో కార్యక్రమానికి హాజరు కావడం సభ్యులకు సంతోషాన్ని కలిగించింది. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు జయ పీసపాటి స్పందిస్తూ.. సభ్యుల చురుకైన భాగస్వామ్యం, కార్యవర్గ సభ్యులు రాజశేఖర్ మన్నే, హెలెన్ తుమ్మల, రాధాదేవి సారంగా అందించిన నిరంతర సహకారమే కార్యక్రమ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. సమాఖ్య సభ్యుల సమష్టి కృషి నిజమైన బలమని ఆమె కొనియాడారు.

ప్రవాస తెలుగువారి మధ్య సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక అనుబంధాలను బలోపేతం చేస్తూ ఈ వేడుక విజయవంతంగా ముగిసింది. తెలుగు ప్రజల సాంస్కృతిక వారసత్వాన్ని, భారతీయ విలువలను తదుపరి తరానికి అందించే ఈ ప్రయత్నం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.






ప్రణబ్ నాకు మార్గదర్శకుడు

ఆయన సలహాతోనే టీఎంసీని వదిలి బీజేపీలో చేరా : పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి వెల్లడి



తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ను వీడి బీజేపీలో చేరాలని దివంగత మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ తనకు సూచించారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. టీఎంసీలోనే కొనసాగితే ఓ ఉద్యోగిలా మిగిలిపోతావని, సొంతంగా ఎదగాలనుకుంటే నరేంద్ర మోదీతో కలిసి ముందుకు సాగాలని ప్రణబ్ ముఖర్జీ తనకు సూచించినట్లు తెలిపారు. కోల్‌కతాలో తాజాగా జరిగిన 'ది ఎకనామిక్ టైమ్స్ బెంగాల్ అసెండ్స్' కార్యక్రమంలో సువేందు అధికారి ఈ విషయాలను వెల్లడించారు. 'ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఉన్న సమయంలో నేను ఆయనను కలిశాను. ఆ సందర్భంగా ప్రణబ్ నాకు కొన్ని కీలక సూచనలు చేశారు. టీఎంసీలోనే కొనసాగితే ఓ ఉద్యోగిలా ఉండిపోతావని, రాజకీయంగా సొంత గుర్తింపు తెచ్చుకోవాలనుకుంటే మోదీతో కలిసి ముందుకు వెళ్లాలని నాకు చెప్పారు. ప్రణబ్ ముఖర్జీ నాకు ఒక మార్గదర్శకుడు. ఆయన సలహాను నేను పాటించాను. ప్రణబ్ ముఖర్జీ ఇప్పుడు మన మధ్య లేరు. ఈ అంశంపై మరిన్ని వివరాలు చెబితే వివాదం తలెత్తే అవకాశం ఉంది' అని సువేందు పేర్కొన్నారు. టీఎంసీ పనితీరుపై ప్రణబ్ ముఖర్జీ చేసిన వ్యాఖ్యలను కూడా సువేందు అధికారి గుర్తుచేసుకున్నారు. టీఎంసీని మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఆధిపత్యంలో నడిచే సంస్థగా ప్రణబ్ అభివర్ణించినట్లు తెలిపారు. వాళ్లిద్దరూ కలిసి పార్టీని ఒక ప్రైవేటు కంపెనీ తరహాలో నడుపుతున్నారని ప్రణబ్ చెప్పినట్లు సువేందు వివరించారు. ప్రణబ్ మాటల్లోని విషయాన్ని అర్థం చేసుకుని టీఎంసీ నుంచి బయటకు వచ్చానని సువేందు పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్‌పై టీవీకే ఎమ్మెల్యే లైంగిక వేధింపులు
విచారణకు తమిళనాడు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు



కళ్లకురిచి కలెక్టర్‌ను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీవీకే ఎమ్మెల్యే సి.అరుళ్ విష్ణేశ్ వ్యవహారంలో తమిళనాడు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యేపై నమోదైన ఫిర్యాదుపై విచారణ జరిపేందుకు నలుగురు సభ్యులతో కూడిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మద్రాస్ హైకోర్టు మంగళవారం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ కమిటీని నియమించింది. తమిళనాడు పర్యావరణ శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి కాకర్ల ఉష ఈ కమిటీకి అధ్యక్షురాలిగా వ్యవహరించనున్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి మధుమతి, ప్రభుత్వ అధికారి సుమతి, సామాజిక కార్యకర్త సునీతా జో ఇతర సభ్యులుగా నియమితులయ్యారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి ఈనెల 27లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన కొన్ని గంటల్లోనే కమిటీని ఏర్పాటు చేశారు. కాగా.. ఎమ్మెల్యేపై ర్యాదు చేసిన మహిళా అధికారి స్వయంగా డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళలపై లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించే జిల్లా స్థాయి కమిటీకి ఆమె నేతృత్వం వహిస్తున్నారు. అయితే, అదే కమిటీ పరిధిలోని అధికారి.. ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయాల్సి రావడంతో ప్రత్యేక పరిస్థితి ఏర్పడిందని హైకోర్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆమె నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీకి బదులుగా ఫిర్యాదుపై విచారణ జరిపేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

మనం అభివృద్ధి చెందితే వారి దుకాణాలు మూతపడతాయి

ఛత్రపతి శంభాజీనగర్‌లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వెల్లడి



ప్రపంచంలో ఏ శక్తి కూడా భారత్ అభివృద్ధి చెందాలని కోరుకోవడం లేదని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి శక్తిమంతమైన దేశాలు ప్రయత్నిస్తుంటాయని అన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత్ మాత్రం తమను ద్వేషించే వారికీ సహాయం చేస్తుందన్నారు. "ప్రపంచంలో ఏ శక్తి కూడా భారత్ అభివృద్ధిని కోరుకోవడం లేదు. ఆయా దేశాలు 'బలవంతుడిదే పైచేయి' అనే సూత్రాన్ని విశ్వసిస్తూ, ఇతరులను ఎప్పుడూ ఒత్తిడిలో ఉంచడానికి ప్రయత్నిస్తాయి. మనం అభివృద్ధి చెందితే వారి దుకాణాలు మూతపడతాయి. కానీ, భారత్ మాత్రం.. మనల్ని ద్వేషించే పొరుగు దేశాలకు కూడా సహాయం చేస్తుంది. మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌తో పాటు పాకిస్థాన్‌కు.. ఆపత్కాలంలో సహాయం చేసింది" అని మోహన్ భాగవత్ గుర్తుచేశారు. బానిసత్వ ప్రభావాల నుంచి నేటి దేశ యువత విముక్తి పొందిందని భాగవత్ అభిప్రాయపడ్డారు. నేటి తరం అబద్ధాలను ద్వేషిస్తుందని, ఎవరైనా నిజాయతీగా మాట్లాడితే వారికి మద్దతుగా నిలుస్తుందన్నారు. తమ దేశాన్ని గొప్పగా చూడాలని నేటి యువత కోరుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ (రిటైర్డ్) ప్రసంగిస్తూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునే విషయంలో యువతదే కీలక పాత్ర అని, అభివృద్ధి ఫలాలు కూడా వారికే చెందుతాయని అన్నారు.

అన్నదాతకు అభయహస్తం

రూ.54 వేల కోట్లతో 6 యూరియా ఉత్పత్తి ప్రాజెక్టుల అభివృద్ధి : కేంద్రం



ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ విషయాలను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ.54 వేల కోట్లతో 6 యూరియా ఉత్పత్తి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సమావేశంలో క్యాబినెట్ నిర్ణయించింది. దీంతో యూరియా కొరత తీరి రైతులకు మేలు జరగనుంది. అలాగే వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రూ.19,934 కోట్ల నిధుల కేటాయింపునకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కన్స్ట్రక్షన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్విప్మెంట్ (సీఐఈ) మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టం పథకానికి 11,000 కోట్ల రూపాయలు కేటాయించింది. తమిళనాడులోని కామరాజా పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్ ఏర్పాటుకు 4,288 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే అస్సాంలోని సిల్చారు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు రూ.2,014 కోట్లను కేంద్ర క్యాబినెట్ కేటాయించింది. పోస్టల్ ఆపరేషన్ పథకం కోసం రూ.1,141 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. పోస్టల్ శాఖలో ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్ పథకం కోసం మరో 1,491 కోట్ల రూపాయలు అందించేందుకు సిద్ధమైంది. కాగా సీఐఈ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టం పథకం ద్వారా మౌలిక వసతులు మరింత బలోపేతమవుతాయని కేంద్రం భావిస్తోంది.

హిందూ మహాసముద్ర దేశాల వ్యూహాత్మక సహకారం



జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో భారత జాతీయ భద్రతా సలహాదారు డోభాల్ పిలుపు

హిందూ మహాసముద్ర ప్రాంత దేశాల మధ్య వ్యూహాత్మక సహకారం మరింత బలోపేతం కావాలని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ పిలుపునిచ్చారు. ఈ ప్రాంతం దేశాలను విభజించేదిగా కాకుండా, కలిపే వారధిగా నిలవాలని బుధవారం ఆయన స్పష్టం చేశారు. మాల్దీవుల రాజధాని మాలెలో జరుగుతున్న 8వ 'కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్' (సీఎస్‌సీ) జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో డోభాల్ పాల్గొన్నా జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో అజిత్ డోభాల్ ప్రసంగిస్తూ.. మారుతున్న భద్రతా సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనేందుకు భాగస్వామ్య దేశాల సామర్థ్యాన్ని పెంచడానికి భారత్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ వేదికను భారత్ 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ 'మహాసాగర్' దార్శనికతతో అనుసంధానించారు. సముద్ర భద్రత, ఉగ్రవాద కట్టడి, అక్రమ రవాణా నియంత్రణ, సైబర్ భద్రత, విపత్తు సహాయం వంటి ఐదు కీలక స్తంభాల ఆధారంగా సీఎస్‌సీ పనిచేస్తోంది. భారత్, మాల్దీవులు, శ్రీలంక, మారిషస్, బంగ్లాదేశ్, సీషెల్స్ ఈ కూటమిలో భాగంగా ఉన్నాయి. హిందూ మహాసముద్రంలో చైనా తన ఆర్థిక, దౌత్య, నావికా ప్రభావాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో డోభాల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన రవాణాకు కీలకమైన ఈ ప్రాంతంలో ద్వీప దేశాలు, పొరుగు దేశాలతో సమష్టి భద్రతా వ్యవస్థను నిర్మించేందుకు భారత్ కృషి చేస్తోంది. మరోవైపు సదస్సు సందర్భంగా మంగళవారం మాల్దీవుల రక్షణ, జాతీయ భద్రతా శాఖ మంత్రి హసన్ రషీద్‌తో డోభాల్ భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు.

మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు ఇటీవల పాకిస్థాన్‌లో పర్యటించి రక్షణ, సముద్ర సహకారం సహా పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ, మాలె మధ్య జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీ దౌత్యపరంగా కీలకంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమెరికాలో వలసదారులకు ఊరట
గ్రీన్‌కార్డు కోసం కొత్త బిల్లు



వాషింగ్టన్: అమెరికాలో దేశ బహిష్కరణ ఆదేశాలు ఎదుర్కొంటున్న పలువురు వలసదారులకు భారీ ఊరట కలిగించేలా డెమోక్రాట్లు కొత్త బిల్లును తీసుకొచ్చారు. దేశ బహిష్కరణ తుది ఉత్తర్వులు వెలువడినప్పటికీ అమెరికాలో కనీసం పదేళ్లుగా నివాసముంటున్న వారికి శాశ్వత నివాస హోదా (గ్రీన్‌కార్డు) కల్పించేందుకు వీలుగా 'ప్రొటెక్ట్ అవర్ నైబర్స్ యాక్ట్' పేరుతో ఈ బిల్లును రూపొందించారు. ఇది చట్టంగా మారితే నిర్దేశిత అర్హతలు ఉన్నవారు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. వలసదారులపై బహిష్కరణ చర్యలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముమ్మరం చేసిన తరుణంలో ఈ బిల్లు ప్రాధాన్యం సంతరించుకుంది. కాలిఫోర్నియాకు చెందిన డెమోక్రటిక్ నేతలు లతీఫా సిమన్, జోయ్ లాఫ్‌గ్రేన్, జాన్ గరమెండి, జువాన్ వర్గస్ నవంబరు 19న ఈ బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఆమోద ముద్ర వేసిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేస్తేనే ఇది చట్టరూపం దాల్చనుంది.

అందరికీ కాదు.. నిబంధనలు ఇవే: ఈ బిల్లు దేశ బహిష్కరణ ఎదుర్కొంటున్న వలసదారులందరికీ గంపగుత్తగా వర్తించదు. దీని ద్వారా లబ్ధి పొందాలంటే దరఖాస్తుదారులు ఈ కింది షరతులను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

- బహిష్కరణ తుది ఉత్తర్వులు వెలువడ్డాక కూడా కనీసం పదేళ్లపాటు అమెరికాలో నివసించి ఉండాలి.
- ఇమ్మిగ్రేషన్ చట్టంలో పేర్కొన్న కొన్ని ఉల్లంఘనల ఆధారంగా మాత్రమే బహిష్కరణ ఉత్తర్వులు జారీ అయ్యుండాలి.
- తీవ్రమైన నేరాలు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలతో ఎలాంటి సంబంధాలు ఉండకూడదు.
- ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండాలన్న ఆదేశాలను ఎప్పుడూ ఉల్లంఘించి ఉండకూడదు.
- తాజా ఫెడరల్ ఆదాయపు పన్ను రిటర్న్ ధ్రువపత్రాన్ని సమర్పించాలి.
- బహిష్కరణ తుది ఉత్తర్వులకు కేవలం పదేళ్ల కాలపరిమితి మాత్రమే ఉండాలని కూడా ఈ బిల్లులో ప్రతిపాదించారు (ప్రస్తుతం ఇలాంటి కాలపరిమితి లేదు).
- కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 26 నాటికి అమెరికాలో సుమారు 16 లక్షల మంది బహిష్కరణ తుది ఉత్తర్వులు అందుకున్నారని గణాంకాలు చెప్తున్నాయి.

అమెరికా నిఘా సంస్థలపై సైబర్ దాడి
చైనా ఏఐ టూల్ 'ఆర్టెక్స్' వినియోగం?



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా రహస్య సమాచారాన్ని సేకరించే అమెరికా నిఘా సంస్థ సీఐఏ కంప్యూటర్ వ్యవస్థల్లోకే హ్యాకర్లు చొరబడి డేటాను తస్కరించారు. ఈ సైబర్ దాడికి చైనాలో తయారైన కృత్రిమ మేధ (ఏఐ) టూల్ 'ఆర్టెక్స్'ను వినియోగించినట్టు ప్రాథమిక దర్యాప్తులో అనుమానిస్తున్నారు. తమవద్ద ఉన్న అత్యంత రహస్య సమాచారం ఏదీ హ్యాకర్ల చేతికి చిక్కలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నప్పటికీ ఈ ఘటన అగ్రరాజ్యాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)తో పాటు నేషనల్ జియోస్పేషియల్-ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ కార్యాలయాల్లోని కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడ్డారు. అయితే కచ్చితంగా ఏ సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లిందనే విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించలేదు. రహస్య డేటా మాత్రం పూర్తిగా భద్రంగా ఉందని స్పష్టం చేశాయి.

ఏమిటీ చైనా ఆయుధం 'ఆర్టెక్స్'?

అమెరికా నిఘాసంస్థల వ్యవస్థల్లోకి చొరబడేందుకు 'ఆర్టెక్స్' అనే ఏఐ టూల్‌ను వాడినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది జులైలో ఓ చైనా ఇంజినీర్ సైబర్ భద్రతా పరీక్షల కోసం దీనిని రూపొందించి బహిరంగంగా అందుబాటులోకి తెచ్చారు. ఆతర్వాత హ్యాకర్లు దీనిని దుర్వినియోగం చేస్తూ జపాన్,దక్షిణ కొరియాలోని పలువ్యాపార,ఆర్థిక సంస్థలపై సైబర్ దాడులకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా చైనా ఇంటెలిజెన్స్ కాంట్రాక్టర్లు అమెరికాపై సైబర్‌దాడులు సాగిస్తున్నవిషయం తెలిసిందే.

ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌పై గురి:

అమెరికా నిఘా వర్గాలు సేకరించిన బహిరంగ సమాచారం, వాణిజ్య పరంగా అందుబాటులో ఉన్న వివరాలు, సోషల్ మీడియా డేటా, ఉపగ్రహ చిత్రాలు,ఇతర ఆన్‌లైన్ మెటీరియల్ (ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్) హ్యాకర్ల చేతికి చిక్కినట్టు సమాచారం. తమకు అందే రహస్య సమాచారానికి వీటిని అనుసంధానించి నిఘా వర్గాలు విశ్లేషిస్తుంటాయి. కాగా ఈ సైబర్ దాడిపై సీఐఏ, ఎన్ఎస్ఏ అధికారికంగా స్పందించలేదు.

సింధ్ విభజనపై భగ్గుమన్న నిరసనలు
'సింధుదేశ్' ఏర్పాటుకు డిమాండ్



కరాచీ: పాకిస్థాన్‌లో సింధ్ ప్రావిన్సును విభజించాలన్న ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ సింధీ జాతీయవాదులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దేశ వాణిజ్య రాజధాని కరాచీ సహా ప్రావిన్సువ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సింధ్ విభజనను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేసిన ఆందోళనకారులు, తమ చారిత్రక, సాంస్కృతిక, ప్రాదేశిక ప్రాధాన్యానికి తగిన విలువిస్తూ 'సింధుదేశ్' పేరుతో స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు సింధీ జాతీయవాద పార్టీల కూటమి 'జీయే సింధ్ రహబర్ కమిటీ (జేఎస్ఆర్‌సీ)' ఈ నిరసనలకు నేతృత్వం వహించింది. సింధ్ విభజన ప్రణాళికలపై ప్రభుత్వం ముందుకెళ్తే పంజాబ్ ప్రావిన్సును ఆర్థికంగా స్తంభింపజేస్తామని హెచ్చరించింది. పాక్‌లో ప్రస్తుతం ఉన్న నాలుగు ప్రావిన్సుల సంఖ్యను 12 నుంచి 15కు పెంచాలని, ఇందులో భాగంగా సింధ్‌ను రెండు నుంచి నాలుగు భాగాలుగా విభజించాలని ప్రతిపాదనలు ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు ఇటీవల వెల్లడించాయి. అయితే సింధ్ విభజన ప్రతిపాదనల వెనుక పాక్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసీం మునీర్ కుట్ర దాగి ఉందని సింధీ జాతీయవాదులు ఆరోపిస్తున్నారు.

16న వస్తా... విమానం పంపండి: షేక్ హసీనా అరెస్టు తప్పదన్న బంగ్లా సర్కారు

ఢాకా: రెండేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. డిసెంబరు 16న తన ప్రయాణ తేదీగా ఆమె ప్రకటించారు. ఇందుకోసం బంగ్లాదేశ్ ప్రభుత్వరంగ విమానయాన సంస్థ 'బిమాన్' విమానాన్ని దిల్లీకి పంపాలని ఆ దేశ ప్రభుత్వాన్ని కోరారు. 1971 నాటి విమోచన యుద్ధంలో భారత బలగాలతో కలిసి పాకిస్థాన్‌పై విజయం సాధించినందుకు గుర్తుగా ఏటా డిసెంబరు 16న బంగ్లాదేశ్‌లో 'విక్టరీ డే' నిర్వహిస్తారు. స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు చరిత్రాత్మకమైన ఆ రోజునే హసీనా ఎంచుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యార్థుల నేతృత్వంలో జరిగిన భారీ ఉద్యమం కారణంగా 79 ఏళ్ల హసీనా పదవీచ్యుతురాలై 2024 ఆగస్టు 5న భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. తన ప్రయాణానికి అవసరమైన పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు వంటి పత్రాలు అందజేయాలని దిల్లీలోని బంగ్లా హైకమిషన్‌ను ఆమె ఇప్పటికే కోరగా... అందుకు ఢాకా నిరాకరించింది. తాజాగా బిమాన్ విమానాన్ని పంపి సగౌరవంగా స్వదేశానికి తీసుకెళ్లాలన్న హసీనా వినతిని కూడా బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. హసీనా అభ్యర్థనపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆమెను అరెస్టు చేసి సంకెళ్లతో, పటిష్ఠ నిఘా నడుమ తీసుకెళ్తామని స్పష్టం చేసింది. విదేశాలకు పారిపోయిన ఇతర నేరగాళ్ల తరహాలోనే హసీనా విషయంలోనూ చట్టప్రకారం వ్యవహరిస్తామని బంగ్లా సర్కారు తేల్చి చెప్పింది.



విశ్వసుందరిగా జెన్నిఫర్ బారెటో
చరిత్ర సృష్టించిన తొలి తల్లి

శాన్‌జువాన్ (ప్యూర్టోరికో): 75వ మిస్ యూనివర్స్ (విశ్వసుందరి) కిరీటాన్ని ప్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో సొంతం చేసుకున్నారు. మిస్ యూనివర్స్ చరిత్రలో తొలిసారి విజేతగా నిలిచిన తల్లిగా ఆమె సరికొత్త రికార్డు సృష్టించడం విశేషం. మెక్సికోకు చెందిన గత ఏడాది విజేత ఫాతిమా బోష్... జెన్నిఫర్‌కు విశ్వసుందరి కిరీటాన్ని అలంకరించారు. ప్యూర్టోరికోలోని శాన్‌జువాన్‌లో జరిగిన ఈ పోటీల్లో 116 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొన్నారు. డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మెలిస్సా నునెజ్ మొదటి రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా వేగాస్ రెండో రన్నరప్‌గా నిలిచారు. ఇక భారత్ తరపున పోటీపడిన కేరళకు చెందిన 19 ఏళ్ల కాజియా లిజ్ మెజో టాప్-30లో చోటు దక్కించుకున్నారు. అయితే టాప్-12కు చేరకుండానే ఆమె ప్రయాణం ముగిసింది.



ప్రశ్నకు ఆకట్టుకునే సమాధానం

ఫైనల్ రౌండ్‌లో ఐదుగురు పోటీదారులను 'ప్రస్తుతం ప్రపంచానికి నాయకుల నుంచి ఏం కావాలి?' అని ప్రశ్నించారు. దీనికి జెన్నిఫర్ స్పందిస్తూ... ప్రపంచానికి వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సహానుభూతి (ఎంపథటిక్) కలిగిన నాయకులు అవసరమని పేర్కొన్నారు. ఇతరులను విమర్శించడం కాకుండా వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలని, తమ విలువలకు కట్టుబడి ఆదర్శంగా నిలవాలని చెప్పి న్యాయనిర్ణేతల మనసు గెలుచుకున్నారు.

పోటీలకు 75 ఏళ్లు... ప్రత్యేక కిరీటం

మిస్ యూనివర్స్ పోటీలు 1952లో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కిరీటాన్ని రూపొందించారు. 'ది రేడియన్స్ ఆఫ్ యూన్ ఎటర్నల్ లెగసీ' పేరుతో తీర్చిదిద్దిన ఈ కిరీటంలో 3,150 వజ్రాలను ఉపయోగించారు.

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్... రెండో స్థానానికి జస్‌ప్రీత్ బుమ్రా



భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. తాజాగా విడుదలైన ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకు దక్కించుకున్నాడు. 856పాయింట్లతో ఇంగ్లండ్ బౌలర్ ఓలీ రాబిన్సన్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా పేసర్ మిచెల్‌స్టార్క్(881)కు బుమ్రా కేవలం 25రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్లు పడగొట్టడం బుమ్రా ర్యాంకింగ్ మెరుగుపడటానికి కారణమైంది. మరోవైపు భారత బ్యాటర్లు కూడా టాప్-10లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. న్యూజిలాండ్‌తో తొలిటెస్టులో 128పరుగులతో ఆకట్టుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్(744 పాయింట్లు) ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. 98 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ (728 పాయింట్లు)ఏడో స్థానంలో ఉండగా...యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (713 పాయింట్లు) తొమ్మిదో ర్యాంకు దక్కించుకున్నాడు. దీంతో టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు నిలబెట్టుకున్నారు. ఇక టీమిండియా బ్యాటర్ కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 25వ ర్యాంకుకు చేరుకున్నాడు. తొలి టెస్టులో 80 పరుగులతో రాణించిన యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంకులో నిలిచాడు. ఇదిలా ఉంటే... బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ (861 పాయింట్లు) అగ్రస్థానాన్ని నిలబెట్టు కోగా... జో రూట్ (816 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా (807 పాయింట్లు) మూడో స్థానానికి ఎగబాకాడు. భారత్‌పై తొలి టెస్టులో అదరగొట్టిన న్యూజిలాండ్ బ్యాటర్ హెన్రీ నికోల్స్ పది స్థానాలు మెరుగుపరుచుకుని 30వ ర్యాంకులో నిలవగా... గ్లెన్ ఫిలిప్స్ 13స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమమైన 17వ ర్యాంకు అందుకున్నాడు.

ఐపీఎల్ వేలంలో ఆర్యవీర్ సెహ్వాగ్



ఐపీఎల్ 2027 మినీ వేలానికి టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ పేరు నమోదు చేసుకున్నాడు. అతడితో పాటు అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన మరో యువ ప్లేయర్ మోహిత్ ఉల్వా కూడా ఐపీఎల్ వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. ఆర్యవీర్ సెహ్వాగ్, మోహిత్ ఉల్వా ఇద్దరూ రూ.30లక్షల కనీస ధరతో వేలంలో తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఇటీవల ముగిసిన అండర్-19 ఆసియా కప్‌లో ఆర్యవీర్ అద్భుతంగా రాణించాడు. ఐదు మ్యాచ్‌ల్లో 361 పరుగులు చేసి టోర్నీలోనే అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. కాగా డిసెంబరు 16న గోవా వేదికా ఐపీఎల్ 2027 వేలం జరగనుంది. భారత అండర్-19 జట్టు కెప్టెన్ లక్ష్య రైచందాని ఈసారి కూడా ఐపీఎల్ వేలానికి రిజిస్టర్ చేసుకోలేదు. భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ ద్రవిడ్ సైతం వేలం నుంచి తప్పుకున్నాడు. అండర్-19 ఆసియా కప్ విజేత జట్టులో సభ్యుడైన పేసర్ కావ్య పటేల్ పేరు కూడా వేలంలో ఉండే అవకాశం ఉంది.

వేలం బరిలో 1,220 మంది ఆటగాళ్లు

ఐపీఎల్-2027 వేలానికి సంబంధించిన ప్రాథమిక జాబితాలో మొత్తం 1,220 మంది ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. డిసెంబరు 1 నాటికి ఈ జాబితాను కుదించనున్నారు. ఫ్రాంచైజీలు తమకు అవసరమైన ఆటగాళ్ల పేర్లతో పాటు అదనంగా పరిగణలోకి తీసుకోవాల్సిన క్రికెటర్ల వివరాలను కూడా సమర్పించనున్నాయి. ఈ జాబితాలో 14 మంది క్యాప్‌డ్ భారత ఆటగాళ్లు ఉన్నారు. ఆవేశ్ ఖాన్, దీపక్ చాహర్‌తో పాటు ఆకాశ్ దీప్, జయదేవ్ ఉనద్కత్, దీపక్ హుడా, కరుణ్ నాయర్, కుల్దీప్ సేన్, మయాంక్ అగర్వాల్, రాహుల్ త్రిపాఠి, సారంగ్ జైన్, శివమ్ మావి, తుషార్ దేశ్‌పాండే, ఉమేశ్ యాదవ్, ఉమ్రాన్ మాలిక్ ఈ జాబితాలో ఉన్నారు. ఆసక్తికరంగా ఆవేశ్ ఖాన్, దీపక్ చాహర్ మాత్రమే స్టోక్స్‌తో పాటు రూ.2 కోట్ల కనీస ధర విభాగంలో ఉన్న భారత ఆటగాళ్లుగా నిలిచారు.

వైభవ్ వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ కూడా బాదేస్తాడు

చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈపై 53 బంతుల్లోనే డబుల్ సెంచరీ బాది చరిత్ర సృష్టించాడు. 15 ఏళ్లకే ప్రపంచ రికార్డులను తిరగరాస్తున్న ఈ కుర్రాడిపై అతడి చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ భవిష్యత్తులో వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ కూడా సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశాడు. అతడు నెలకొల్పుతున్న రికార్డులను బద్దలు కొట్టాలంటే వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ క్రిస్‌గేల్ మళ్లీ మైదానంలోకి రావాల్సిందేనని వ్యాఖ్యానించాడు.

'వైభవ్ సూర్యవంశీ ఏదో ఒక రోజు వన్డేల్లో డబుల్ సెంచరీ చేస్తాడని రెండేళ్ల క్రితమే నేను ఊహించా. ఇప్పుడు అతడి ఆటతీరును చూస్తుంటే ట్రిపుల్ సెంచరీ కూడా సాధించడం అసాధ్యమేమీ కాదు. వైభవ్ ఏదో ఒక రోజు 300 పరుగులు కూడా చేస్తాడని నేను నిజంగా నమ్ముతున్నాను. యూఏఈతో అతడు ఆడిన ఇన్నింగ్స్ అసాధారణం. అందులో దూకుడు, వినోదం, అద్భుతమైన బ్యాటింగ్ అన్నీ ఉన్నాయి. వన్డే క్రికెట్‌ను చూసే విధానాన్నే అతడు మార్చేస్తున్నాడు. 14-15 ఓవర్లలోనే 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించగలిగే సామర్థ్యం వైభవ్‌కు ఉంది. ఇదే దూకుడుతో 50 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేస్తే ఇంకెన్ని పరుగులు సాధించగలడో ఊహించుకోవచ్చు. ప్రస్తుతానికి వైభవ్ రికార్డులను బద్దలుకొట్టగల ఆటగాడు ఎవరూ కనిపించట్లేదు. వాటిని అధిగమించాలంటే బహుశా విండీస్ దిగ్గజం క్రిస్‌గేల్ తిరిగి రావాలేమో. వైభవ్ నెలకొల్పిన రికార్డులను వైభవే బద్దలుకొట్టగలడు' అని మనీశ్ ఓజా వెల్లడించాడు.

టీమిండియాలో మరిన్ని అవకాశాలివ్వాలి

'వైభవ్ ఈ మ్యాచ్‌లో ఆడాడు కాబట్టే 204 పరుగులు చేయగలిగాడు. బెంచ్‌పైనే కూర్చోబెడితే ఇలాంటి ఇన్నింగ్స్ ఎలా ఆడతాడు? ఆటగాడు మైదానంలోకి దిగి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడే అనుభవం వస్తుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అతడికి కనీసం రెండు, మూడు అవకాశాలైనా ఇవ్వాలి. ఒక మ్యాచ్‌లో మంచి ప్రదర్శన చేస్తే తర్వాతి మ్యాచ్‌లోనూ అవకాశం కల్పించాలి. అతడిని కేవలం ప్రత్యామ్నాయ ఆటగాడిగా చూడకూడదు' అని మనీశ్ ఓజా బీసీసీఐ సెలెక్టర్లకు సూచించాడు.

నాపై కమిన్స్ మాటల దాడికి దిగుతాడని ఊహించలేదు: ఉస్మాన్ ఖవాజా



మెల్‌బోర్న్: 'శాండ్‌పేపర్ గేట్' వివాదంపై ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశం తనను తీవ్ర నిరాశకు గురి చేసిందని సీనియర్ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా పేర్కొన్నాడు. బాల్ టాంపరింగ్ వ్యవహారంలో కేవలం ముగ్గురినే బలిచేశారని, జట్టులోని మిగతా వారందరికీ ఆ విషయం తెలుసునని ఖవాజా తన ఆత్మకథలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆసీస్ క్రికెట్‌లో దుమారం రేగుతుండగా, ఖవాజా చెబుతున్నవన్నీ అవాస్తవాలని కమిన్స్ కొట్టిపడేశాడు. ఈ నేపథ్యంలో ఖవాజా స్పందిస్తూ... కమిన్స్ వ్యాఖ్యలు తనకు ఆశ్చర్యం కలిగించాయని చెప్పాడు. ప్యాట్‌ను వ్యక్తిగతంగా తాను ఎంతో ఇష్టపడతానని, కెప్టెన్‌గా అద్భుతమైన వ్యక్తి అని కొనియాడినప్పటికీ, అతడి నుంచి ఇలాంటి మాటలు వస్తాయని ఊహించలేదన్నాడు. ఆపై తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం తీవ్రంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ప్రస్తావించిన అంశాలపై చాలాసేపు విమర్శలు చేస్తుండటంతో కమిన్స్‌లోని ఆ కోణాన్ని ఎప్పుడూ చూడలేదని, అందుకే నిరాశకు గురయ్యానని తెలిపాడు. కమిన్స్ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను పూర్తిగా చూడాలనుకోలేదని, ఏం చెప్తున్నాడో తెలుసుకోవడానికి మాత్రమే చూశానని ఖవాజా వివరించాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న తన భార్య రేచల్ 'బాగానే ఉన్నావుగా' అని అడిగినా సమాధానం ఇవ్వలేకపోయానని, తీవ్ర భావోద్వేగానికి గురయ్యానని చెప్పాడు. తన సమస్య ప్యాట్‌తో కాదని, అప్పట్లో జట్టులో ఉన్న కొందరు ముందుకొచ్చి బాధ్యత తీసుకుంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు. ఇది కమిన్స్ సమస్య కాదని... క్రికెట్ ఆస్ట్రేలియాకు సంబంధించిన వ్యవహారమని పేర్కొన్నాడు. ఎలాగైనా విజయం సాధించాలనే ధృక్పథం కోచ్‌ల నుంచి ఆటగాళ్ల వరకు విస్తరించిందని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నట్టు ఖవాజా వెల్లడించాడు.

పారా ఆర్చర్ శీతల్ దేవికి 'హ్యుందాయ్' కానుక



గురుగ్రామ్: భారత పారా ఆర్చరీ స్టార్ శీతల్ దేవికి ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ ప్రత్యేక కానుక అందించింది. ఇటీవల జపాన్‌లో జరిగిన 2026 ఆసియా పారా గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించిన ఆమెకు సంస్థ కొత్త 'బేయాన్' ఎస్‌యూవీ కారును బహూకరించింది. గురుగ్రామ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రతినిధులు ఆమెకు కారును అందజేశారు. రెండునెలల క్రితమే శీతల్‌ను హ్యుందాయ్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిన విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్‌కు చెందిన శీతల్ 17ఏళ్ల వయసులోనే పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచి భారత్ తరపున పతకం సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది. అనంతరం 2025లో దక్షిణ కొరియాలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించింది. 2024లో ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు అందుకున్న ఆమె తాజాగా జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు గెలుచుకుంది. మహిళల కాంపౌండ్ డబుల్స్‌లో పాయల్ నాగ్‌తో కలిసి రజత పతకం సాధించింది.

ఐఓఏ అధ్యక్ష రేసులో నారంగ్



న్యూఢిల్లీ: ఒలింపిక్ పతక విజేత, మాజీ షూటర్ గగన్ నారంగ్, జాతీయ ఫెన్సింగ్ సంఘం కార్యదర్శి రాజీవ్ మెహతా, ఆర్చరీ సంఘం కార్యదర్శి వీరేంద్ర సచ్‌దేవ్ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్ష పదవికి నామినేషన్లు వేశారు. మంగళవారంతో నామినేషన్ల గడువు ముగిసింది. కాగా ఈ ముగ్గురు నామినేషన్లు వేసినా పోటీ మాత్రం గగన్, రాజీవ్ మధ్యనే ఉంటుందని తెలుస్తోంది. ఇక ఐఓఏ ప్రస్తుత అధ్యక్షురాలు పీటీ ఉష ఆఖరి నిమిషంలో అధ్యక్ష పదవి పోటీ నుంచి తప్పుకుంది. మహిళా ఉపాధ్యక్ష పదవికి మాజీ లాంగ్ జంపర్ అంజు బాబీ జార్జ్, ఈసీ సభ్యుడిగా మాజీ రెజ్లర్ యోగేశ్వర్ దత్ నామినేషన్లు దాఖలు చేశారు. వచ్చే నెల 5న ఎన్నికలు జరగనున్నాయి.

చైతన్య రథం
సినిమా
గురువారం 26 నవంబరు 2026 X


పెళ్లికి వ్యతిరేకం కాదు సరైన బంధం కోసమే ఎదురుచూపు:
- నిత్యా మేనన్



చెన్నై: పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని తాను ఎప్పుడూ చెప్పలేదని, జీవితంలో సరైన వ్యక్తితో బంధం ఏర్పడాలని కోరుకుంటున్నానని ప్రముఖ నటి నిత్యామేనన్ స్పష్టం చేశారు. కేవలం పెళ్లి చేసుకోవడం కంటే సరైన బంధానికే తాను ఎక్కువ ప్రాధాన్యమిస్తానని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన వ్యక్తిగత జీవితం, వివాహం, స్వభావంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నేను పెళ్లి చేసుకోను అని చెప్పినప్పుడు.. పెళ్లికి పూర్తి వ్యతిరేకమని, అసలు వివాహం చేసుకోవాలనే ఆలోచనే లేదని అందరూ భావించారు. కానీ నా ఉద్దేశం అది కాదు. నాకూ పెళ్లి చేసుకోవాలని ఉంటుంది. అయితే ఎలాంటి వ్యక్తి జీవితంలోకి రావాలి, ఆ బంధం ఎలా ఉండాలి అనే విషయంలో నాకు పూర్తి స్పష్టత ఉంది. నా లక్ష్యం కేవలం పెళ్లి చేసుకోవడం మాత్రమే కాదు.. నన్ను అర్థం చేసుకుని, స్వేచ్ఛనిచ్చే సరైన వ్యక్తితో బంధాన్ని ఏర్పరచుకోవడం" అని నిత్యా మేనన్ వివరించారు.

తన వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ.. తనకు సవాళ్లు ఎదురైనప్పుడే కొత్త విషయాలు నేర్చుకోగలనని నిత్య చెప్పారు. "చిన్నప్పటి నుంచి ఎవరైనా నన్ను తదేకంగా చూస్తే వెళ్లిపోమని చెప్పేదాన్ని. నాకు సిగ్గు ఎక్కువ. అందరి ముందూ కనిపించడం అంతగా ఇష్టం ఉండదు, కాస్త ఇబ్బందిగా అనిపిస్తుంది. నాకు అదొక సవాలు లాంటిది. ఎందుకు అసౌకర్యంగా అనిపిస్తోంది? దాని వెనుక కారణమేంటి? అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. అది మనల్ని మనం అంచనా వేసుకునే విధానానికి సంబంధించిన విషయమని అనిపిస్తుంది" అని ఆమె పేర్కొన్నారు.

తెరపైకి తొలి ఏఐ నటుడు ప్రధాన పాత్రలో 'ఏకలవ్య' వెబ్ సిరీస్!



ముంబయి: కృత్రిమ మేధ (ఏఐ) ప్రతి రంగంలోనూ ఊహించని మార్పులను తీసుకొస్తోంది. ఇందుకు సినీ రంగం కూడా మినహాయింపు కాదు. చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ వంటి సాంకేతిక విభాగాల్లో ఇప్పటికే ఏఐని విరివిగా వాడుతున్నప్పటికీ ఇప్పుడు ఏకంగా తెరపై ఏఐ సృష్టించిన నటులు సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. తొలిసారిగా ఓ ఏఐ నటుడు ప్రధాన పాత్రలో నటిస్తున్న వెబ్ సిరీస్‌ను విడుదల చేయబోతున్నట్టు ఓటీటీ వేదిక లయన్స్ గేట్‌ప్లే బుధవారం అధికారికంగా ప్రకటించింది. మహాభారతంలోని ఏకలవ్యుడి పాత్రను ఆధారంగా చేసుకుని 'ఏకలవ్య' పేరుతో ఈ వెబ్ సిరీస్‌ను రూపొందిస్తున్నారు. ఇందులో ప్రధాన పాత్రను పూర్తిగా ఏఐ సాంకేతికతతో డిజైన్ చేయగా... ఆ ఏఐ నటుడికి 'యుగ్ ఆర్.ఏఐ' అని నామకరణం చేశారు. ఈ పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన వీడియో విశేషంగా ఆకట్టుకుంటోంది. విభు పురి దర్శకత్వం వహిస్తున్న ఈ ఎనిమిది ఎపిసోడ్ల సిరీస్ వచ్చే ఏడాది (2027) హిందీ, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. భవిష్యత్తులో మరిన్ని ఏఐ ఆధారిత ఒరిజినల్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్టు లయన్స్ గేట్‌ప్లే వెల్లడించింది.



'ఈఠ' కోసం శ్రద్ధాకపూర్ అంకితభావం

బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ తన తాజా చిత్రం 'ఈఠ' కోసం ఎంతో కష్టపడ్డారని దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ కొనియాడారు. పుణెలో జరిగిన ఈ చిత్రంలోని 'జీ జీ రే జీ' పాట విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రద్ధా అంకితభావంపై ప్రశంసల జల్లు కురిపించారు. "పాట కోసం శ్రద్ధా 25 రోజుల పాటు రిహార్సల్స్ చేశారు. ఒక్కో కాలికి 4 కిలోల బరువున్న గజ్జెలు కట్టుకుని రోజుకు ఎనిమిది గంటల పాటు సాధన చేసేవారు.

దాంతో ఆమె పాదాలు వాచిపోయేవి. మరాఠీ 'లవాణి' కళారూపాల లోతును అర్థం చేసుకుని... ఆ కళను నేర్చుకోవడానికి ఆమె పూర్తిగా అందులో మమేకమయ్యారు. పాట చిత్రీకరణ మొదటి రోజు సజావుగానే సాగింది. కానీ రెండో రోజు శ్రద్ధా కాలి కండరాలకు గాయమైంది. దీంతో షూటింగ్ నిలిపివేయాల్సి వచ్చింది" అని లక్ష్మణ్ ఉటేకర్ వివరించారు. షూటింగ్ ఆగిపోయినందుకు తనకు పెద్దగా బాధ కలగలేదని, కానీ ఆ కారణంగా శ్రద్ధా ఏడుస్తుండటం చూసి ఎంతో బాధపడ్డానని ఆయన తెలిపారు. నెల రోజుల్లోనే గాయం నుంచి కోలుకుని ఆమె తిరిగి సెట్స్‌కు వచ్చారని, ఈ పాత్రను శ్రద్ధా తప్ప మరెవరూ ఇంత బాగా పోషించలేరని దర్శకుడు ప్రశంసించారు. ఇండస్ట్రీలో ఆమెకు సాటి ఎవరూ లేరని కితాబిచ్చారు. కాగా ప్రముఖ మరాఠీ 'లవాణి', తమాషా కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్కర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ బయోపిక్ డిసెంబరు 4న థియేటర్లలో విడుదల కానుంది.

'వారణాసి' రిలీజ్ డేట్ మారనుందా!

సూపర్ స్టార్ మహేశ్‌బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మేకర్స్ ప్రకటించిన ప్రకారం 2027 ఏప్రిల్ 7న ఉగాది కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాల్సి ఉంది.అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీ మారబోతోందం టూ ఫిల్మ్‌నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.'వారణాసి'



సినిమాకు సంబంధించిన భారీ విజువల్ ఎఫెక్ట్స్, సీజీ వర్క్ ఇంకా పూర్తి కావాల్సి ఉండటంతో ప్రకటించిన తేదీకి సినిమాను సిద్ధం చేయడం కష్టమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజమౌళి తన సినిమాల అవుట్‌పుట్ విషయంలో ఎక్కడా రాజీపడరు. ప్రతి సన్నివేశాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తారు. ఈ నేపథ్యంలో 'వారణాసి' విజువల్ ఎఫెక్ట్స్ పనుల కోసం మరింత సమయం తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఏప్రిల్ 7కు బదులుగా 2027 జులై 29, ఆగస్టు 5 లేదా ఆగస్టు 12 తేదీలను చిత్ర బృందం పరిశీలిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. అయితే ఈ తేదీలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటనా వెలువడలేదు.

నన్ను కూడా సీఎంను చేస్తారా? శర్వానంద్

హైదరాబాద్: కథా నాయకుడు శర్వానంద్ ప్రధాన పాత్రలో సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఈ సినిమాలోని 'గంగ థీమ్' పాటను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ పాటను ఆలపించిన ప్రముఖ జానపద గాయకుడు నల్గొండ గద్దర్ నర్సన్నను ఉద్దేశించి శర్వానంద్ సరదాగా వ్యాఖ్యానించారు. "మీరు ఇప్పటికే చాలా మంది ముఖ్యమంత్రులకు పాటలు పాడారు. ఇప్పుడు ఈ సినిమాలో నా కోసం పాట పాడారు. మరి నన్ను కూడా ముఖ్యమంత్రిని చేస్తారా? ఏమో.. నేను కూడా విజయ్‌లా సీఎం అవుతానేమో" అని శర్వానంద్ చమత్కరించడంతో వేదికపై నవ్వులు విరిశాయి. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథా నాయికలుగా నటిస్తుండగా... భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.



ఆస్కార్ బరిలో 'రామాయణ'

ముంబయి: ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల రేసులో 'రామాయణ' చిత్రం ముందడుగు వేసింది. భారీ హంగులతో తెరకెక్కిన ఈ సినిమా ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ (ఎఖీశ) విభాగానికి సంబంధించి టాప్-20 జాబితాలో చోటు దక్కించుకుంది. దీంతో 'ది ఒడిస్సీ', 'డ్యూన్: పార్ట్ 3', 'అవెంజర్స్: డూమ్స్‌డే' వంటి భారీ హాలీవుడ్ చిత్రాలతో తదుపరి రౌండ్‌లో ఈ సినిమా పోటీపడనుంది. డిసెంబరు 15న టాప్-10 షార్ట్‌లిస్ట్ జాబితాను ప్రకటించనున్నారు.

